ప్రథమాంకము.

హే. సోదరా! బా... నీ వేట నేర్పుం జూచు ...

కన్నులకు లేకపోయె? ... ఆ... అ...

బంతయు వినుచుంటి ... ... త తరువా...?

—తరువాత సోదానవ ... ... తరువుల...

వేయు కేకలను మోర ... ... లిరా ... ...

రుమవచ్చు వేటకుక ... ... కేం ...

బుల మాంసపుకం ... ...టు గోన

రించెడి సూకరంబుల ... ... బల్లెముల చే

తను, వానిని జంపఁజొచ్చిరి. మన సైనికుల ... ...తంబులకు

సూకరంబుల దేహంబులనుండి వ్రేలాడు ప్రేవులు వ్రేలాడు

చుండఁగా వేటకాండ్ర బారినుండి తప్పించుకొనం దలంచియు

పారిపో లేక పాదలంజూర బడి బలహీనతనొందియు ఘుర్ఘురధ్వానం

బులుగొన పొదుకొనికూర్చుండి, వేటకాండ్రనుదగ్గరకు రానీయ

కుండఁగా పొదుకొనుచుండెనో యనునట్లు భయంకరాకృతిం

దాల్చిన కన్నులనుండి విస్ఫులింగంబులు జలజలరాల్చుభంగి,

ను మ్మందఱఁ జంపివేయునట్లు, తమ యెఱ్ఱనిచూపులు మాపైఁ

బ్రసరింపఁజేసినవి.

హిర——ఏమీ! అరణ్యంబంతయు నంత భయంకరముగా నున్నదా?

అలంబాసురా! తరువాత తరువాత?

అలం——తరువాత నోప్రభూ! యువరాజద్దానింగని, యెక్కుపెట్టినవిల్లు

ను, బాణంబులతో నిండుకొనియున్న యమ్ములపొదిం ... దా

ల్చి, యమ్ములపొదిలోని బాణంబుల బెఱికి చేతఁదీసికొ... ...

దిక్కులం గలయంజూచి, మిగిలినవారందఱు తనవలె ... ...

యితమై నిల్చుటంగని మనమున సంతసించి బాణమేయందలం

చి విడువగా నబ్బాణంబు దూరంబుగానున్న సూక... బులకు

యుటకుమారుగా పదిగజంబుల మేరలోఁ బడియె. విల్లు వా[illegible]ంబులనుండి హఠాత్తుగా క్రిందఁబడియె. వెంటనంటియున్న సహాసాత్రుఁ డదిగని "దేవా! యేలయిట్లా విల్లుఁ గ్రిందఁబడవైచితి"రని యడుగ "సహాసాత్రా! నేఁడ దేలకోగాని యెన్నఁడు లేని యశుభంబులు గానవయ్యెడిని. వామభుజంబును, నేత్రంబును, తొడయునుఁగూడఁ గంపింపఁదొడఁగె. విశేషించి భుజ[illegible] సదుటచేఁ బట్టుతప్పె. అయినను నిట్టి యనిమిత్తంబులకు హిరణ్యాత్మజుండు వెనుకంజ వేయునే?" అని వేగ మఱల విల్లుం [illegible], యమ్ములుదీసికొని, యొకదానివెంబడి నొకటిగా న[illegible] బాణపరంపర లాసూకరంబులపైఁ గురిపించె.

హి—[illegible]సోదరుని ధైర్యము! తరువాత తరువాత?

అ—త[illegible]వాత నోదానవనాయకా! అట్టి బాణఘాతంబున కనేక సూకరంబులు రూపుమాసినవిగాని, గమికి కన్నాకయునిలిచిన సూకరంబుమాత్రము మడియక, రెట్టించినకోపముతో తగరు కొండను దాఁకినవిధంబున" యువరాజుపై కుఱికె. దాని కా యువరా జెంతయు న్లంకక కత్తినెత్తి నఱుకఁబోయెను గాని యాపంది యొక్క కొమ్ములకుందగిలి యా కత్తి తుత్తునియ లయ్యెను. వేఱొండుఖడ్గంబు గ్రహించుటకైననుందగినయదను దొరకదయ్యె. భీతిల్లక ముష్టియుద్ధమునందు మిగులఁ బ్రజ్ఞావంతుఁడగుటచే హస్తంబుల నాకుందారము నెత్తి గిరగిరం ద్రిప్పి యొకబండరాతి నేసికొట్టెను.

హి—(సంతోషముతో) ఆఘాతంబున కాసూకరం బడలి పడి చచ్చెనా? లేదా? వేవేగఁ దెల్పుము?

అ—దేవా! అట్లేలజరుగును? విధివిధానము వేఱైయుండ మన మనుకొనిన విధం బెన్నటికైనంజరుగునే? ఆఘాతంబున కాకిటి

ప్రథమాంకము.

ఋషభాంతయు న్లొంగక వెనుదిరిగి యువరాజుపైకురికె తమ్ములో యువరాజుం బైకెగరవేసి బాలుండు ...తూలి తూ-లిం-చి-తూ-లిం-చి——(అని విచారము సూచించును)

హిర——ఓరీ! అలంబాసురా! ఊరకుంటివేమి? నామనంబారక తామరాకులోని జలములట్లు తల్లడిల్లఁజొచ్చె. నా ... నేమియుపద్రవంబు మూఁడెనో వేగఁ దెల్పుము?

శంబ——అలంబాసురా! నాజనకున కెట్టియవస్థ తటస్థించెనో వేగఁ దెల్పుము?

అల——(తలవాల్చి విచారము సూచించును.)

హిర——ఓరీ! ఏమట్లాలోచించుచుంటివి? త్వరితగతి జరిగిన వృత్తాంతముం జెప్పరాదా?

అలం——అటులాయువరాజును తూలించి, తూలించి, తుదకాతనిఁ గ్రిందఁబడవైచి తనకొమ్ముతో వక్షస్థలం-బు-నుం-జీల్చి-చీ-ల్చి——(రోదనముఁ జేయుచున్నాఁడు.)

హిర——అలంబాసురా! ఇఁక వినుట చాలును. (విచారముతో) హా! తమ్ముఁడా! నీకెంతముప్పువచ్చినది. హా! హా!!

సీ. లలిఁ గశ్యపబ్రహ్మ । కులవార్ధిరత్నమా!
దనుజసంతతి బాసి । తరలినావె?
అన్నపై నెంతేని । మన్నన విడనాడి
స్వర్గంబుఁ జేరితే । శౌర్యవార్ధి!
పతియె దైవమటంచు । భావించు నీనాఁతి
విడిచి యేగితె వేల్పు । వెలఁదిఁగవయ
అల్లారు ముద్దయిన । పిల్లవానిని వీడి
దివి కేగియుంటివే । దితికుమార!

గీ. బాహుళభువన ప్రశస్తదో ॥ ర్బల వితాన
పత్రగులతా లవిత్రమ! భుజా ॥ విపులదర్ప!
తుదకు నొక పందిపోటుచే ॥ దొలఁగినావె
తమ్ముఁడా! బ్రహ్మవ్రాతను ॥ దాఁటలేక.

శంబ— విచారముతో) హా! జనకా!! ఎట్టి గబ్బిబెబ్బులులనైనను దబ్బుబ్బుపడునటు లొనరించి నిబ్బరముగా చూచువారలబ్బుర మందునటులా బెబ్బులులంబడఁ ద్రొబ్బెడు బాహుబలశాలివి నాతుచ్ఛసూకరంబునకుఁ బ్రాణంబులర్పించితే? హా! తండ్రీ! నా కేదిదిక్కు? నన్నెవ్వరుప్రోతురు. అయ్యో! జననీ!వింటివే? నిన్నును నన్నును దిక్కుమాలినవారిఁగా నొనరించి నీమనో హరుం డస్తమించెనను ఘోరవార్త.

హిర—ఓ సోదరా! సోదరా!

మ. పుడమి న్జాపగఁ జుట్టినాఁడవుగదా? ॥ ప్రోద్దామశౌర్యంబునన్
వడిగా శత్రులఁ జంపినాఁడవుగదా? ॥ పల్మాఱు ధైర్యంబుతో
నడవిన్ గ్రూరమృగాళిఁజంపితిగదా? ॥ హా! యంత్యకాలంబునన్
జెడు కుందారము చేతఁబాసితిగదా? ॥ జీవంబుల న్దమ్ముఁడా!

అయ్యో! నీచకుందారం బేడ? భవదీయ ప్రాణాపహరణంబుఁగావించు టెడ? నమ్మఁజాల.

విప్ర—దేవా! బాలుఁడైనశంబరాసురుని, యబలయైనమీమఱఁదలిని, మీయంబయగు దితిని, నూరడింపవలసిన తమ రేయిట్లు శోకసముద్రమందున మునుంగఁదగునే? తత్వమరసిచూడ బంధుమిత్రాదులు ఋణానురూపసంబంధులుగదా? "ఋణాను బంధరూపేణ పశుపత్నిసుతాలయాః" అను వాక్యంబు మీరువినలేదా? మఱియు,

ప్రథమాంకము.

సీ. పంచభూతంబుల । ప్రాభవంబునఁగల్లు
గేహంబుగాదె యీ । దేహ మాగ యఁ ?
పూర్వకర్మముచేతఁ । బొందిలోఁ బ్రాణంబు
దగనిల్చి యొకవేళ । తరలిపోవు
నూహింప చెడునది । దేహ మొక్కటె గాని
యాత్మ నాశముఁజెందఁ । దసురన థ !
యాత్మయు, దేహంబు, । నరయంగ ద్వివిధంబు
గాని యేకత్వంబు । గానరాదు

తే. గీ. ఋణము దీరినవెన్క దా । నింకఁ దుదకు
నొక్క నిముసంబ్రైనను । నుండ దాత్మ
యర్థకాంక్షల కైనడి । నమరియున్న
కేవల శరీరములఁగూర్చి । కించ యేల ?

వెండియుఁగాలముదాపురించిన నేప్రాణియు నిలువదు. శమనునియాజ్ఞయైనచోఁ బోవకతప్పదు. కాఁబట్టి యట్టిదేహముఁగూర్చి చింతించుట వెర్రితనముగాదే ? యువరాజుగారి మరణవార్తవిని మాబోంట్లమేకడుంగడుదుఃఖించుచుండ, నేకగర్భసంజాతులరగు తమకు దుఃఖంబుండదని పల్కఁజాలము. ఎంతదుఃఖంబున్నను దిగమ్రింగియూరకుండవలసినదేగాని వేఱొండులాభంబు గానరాదు. ఎంతకాలంబు విచారించినయైనను పోయినప్రాణంబులు మఱలఁ దెప్పించినవారలుగలరే? ఎవ్వఁడయినను విచారించి పోయినవారితోఁగూడఁ బోవఁగలఁడే ? కావున మీకును, సూకరంబుచేఁ బ్రాణంబులం గోల్పోయిన యుష్మత్సహోదరుండగు హేమలోచనునకును సంబంధ బాంధవ్యంబులేమియు లేవని మీమదియందుధృతింబాదుకొల్పి చింతఁదక్క-

ఘుండుఁడు. ఎంతచింతించినను గతించిన నీసోదరునియుసురులు తిరిగిరావు గదా ?

అల—దేవా! నా చెప్పవలసినదింకుక గల దద్దానిఁగూడ వినుండు.

హిర—(విచారముతో) అలంబాసురా! ఇంక నేమిగలిగినదో త్వరిత గతిం దెల్పుము ?

అలం—దేవా! అట్లాసూకరం బాయువరాజుప్రాణంబుల నీడిసికొని పేగులు తన కొమ్మునందగిలించి మహాకోపంబున నీడ్చి—

హిర—ఓరీ! ఏమిరా! ఇదివఱకే విచారాంబుధిలోమునిఁగి పరితపించు చున్న మాకు మాసోదరు బలవన్మరణము గుఱించి యేమేమి యో గొప్పగాఁ జెప్పుచుంటివి? ముఖ్యముగాఁ జెప్పవలసిన దెద్దియేనియున్న సంగ్రహముగాఁ జెప్పుము?

అలం—దేవా! అటులయిన వినుండు. వధ నైన తరువాతనాసూకర మే చూచువార లత్యాశ్చర్యం బందునట్లుగా జగద్దేదీప్యమా నంబైన కాంతి ప్రసరించుచు, శంఖ చక్ర గదా శార్ఙ్ఖడ్గం బులతోడను, చతుర్భుజంబులతోడను, పీతాంబరములతోడ ను, నీలమేఘచ్ఛాయను మించుశరీరకాంతితోడను, నిజస్వ రూపంబున విష్ణువు ప్రత్యక్షంబయి యిట్లనియె. "ఓరోరిదుర్మ తీ! ముష్కరాధముండవై భూదేవిని సిలుగులం బెట్టినఫలం బచిరకాలంబులోనఁ బొందితివి" తరువాత మఱిరెండు నిమే షంబుల కా విష్ణు వంతర్ధానంబయ్యె పౌలికలనిమాదిరిగా నయ్యరణ్యంబునఁ బ్రాణంబుగల జంతువు లెచ్చటనుగానరా వయ్యెను.

విప్ర—దేవా! అలంబాసురుని వాక్యంబు లాలించి యాలోచించి చూచినచో దనుజకులమర్దనుఁడగు జనార్దనుఁడే భవదీయసోద

రుని ప్రాణాపహరణంబుఁగావించెనని నిశ్చయింపవలసివచ్చు న్నది. లేదేని పందియేడ? హేమలోచనుని ప్రాణాపహరణం బుగావించుటేడ?

హిర—విప్రజిత్తీ! నీమాటయే సత్యము. ఔరా! మాయాచారీ! దుర్మదవిహారీ? కుటిలమార్గంబుననే గాని న్యాయమార్గంబున శత్రుప్రాణంబుల న్దీయుట నీ శక్యము కాదఁటరా. దొంగపోటుగావచ్చి శత్రునాశముంగావించు నీవేటి మేటిబంటువురా? నీవు నిక్కువమైన పౌరుషమేగలదేని ఖడ్గము చేతఁబూనిముఖాముఖిని సమరముఁజేసిన బలాబలంబులు తెల్లమయ్యెడినే? ఏటికిట్లు పనికిమాలినపని చేసితివిరా! పిఱికిపందా!

విప్ర—ప్రభూ! ముఖాముఖిం బోరుట కాతఁడు సమర్థుండు గాఁడు. కనుక నేనీచమగురూపముం దాల్చి హేమలోచనునిసంహరించె. బాహుబలం బిసుమంతయేని లేని యాపిఱికిపంద మీమ్రోలఁగాని, మీసహోదరుసమక్షమునఁగాని నిల్చుట కాతండొప్పునే?

హిర—మంత్రీ! విప్రజిత్తీ! బలపరాక్రమసంపద లిసుమంతయేని లేని య్యాపిఱికిపంద శత్రునాశముఁగావించుట కిట్టితుచ్ఛరూపము మున్నెన్నండైనఁ దాల్చెనని వింటివే?

విప్ర—దేవా!

మ. వినలేదే తమ రెన్నఁడీచరిత? మా । విష్ణుండు మాయావియై
కన వేదంబులు బ్రహ్మకీయ మది సం । కల్పంబుతో నుండఁగా
విన సందంబున భీరువట్లుడఁగ, నా । వీరుండు వారాసిలో
మన వంశస్థుని సోమకాసురుని దా । మ్రగ్గింపఁడే నిర్దయన్.

హిర—ఏమీ! అమ్మాయకాఁడు నాసోదరుని మడియించుటే గాక మనవంశస్థుండగు సోమకాసురునిం గూడ మడియించెనా? అటులయిన నా వేషధారినడఁగఁద్రొక్కువఱకు నాప్రాణమూరటఁ

...ండదు. కాబట్టి నాతమ్మునికుత్తరక్రియలు జరిగించినమఱు నాఁడే బయలుదేరి మందరాద్రికిం జని యహోరాత్రంబు లేక దీక్షతో నిద్రాహారంబులఁ ద్యజించి, హంసవాహనునింగూర్చి తపం బాచరించి, పెక్కువరంబులం బడసి యటుపైని నాసోదరుఁ జంపిన యామోసకానిం దుంచెద. అప్పుడు నామనంబు న... న్న నుమ్మలికం బడంగు.

విప్ర—దేవా! మీయూహ కడుంగడు సమంజసముగానున్నది. ఉత్తమపురుషలక్షణంబు లట్టివియేగదా? శత్రుప్రాణాపహరణంబు గావించుటయే యుత్తమము గాని యూరక వాపోవుటవలన లాభంబు లేదుగదా? కానమీ చెప్పినచొప్పున తపం బాచరించి మీయిష్టదైవంబగు కమలాసనునివలన వరంబులం బడసిరండు.

హిర—మేలు మంత్రీ! మేలు. విప్రజిత్తీ! నాయుద్యమంబునకుం దగినవాక్యంబులఁ బ్రోత్సాహపఱిచినందులకే నెంతయు సంతసించుచుంటిని, (శంబరునితో) కుమారా! శంబరా! నీ వీమంత్రిసత్తముండగు విప్రజిత్తి యాలోచనాప్రకార మీరాజ్యభారము వహింపుము. గతించిన నీజనకునికై కడుంగడు గుందకుము. నీజనకునిప్రాణంబు లపహరించిన యాజడమతిప్రాణంబులన్దీయువఱకు నాకు నిద్రాహారంబులపై నిచ్చ జనియింపదు. కాన నావాక్యంబు లాలించి యట్లొనరింపుము.

శంబ—తండ్రీ! భవదాజ్ఞానువర్తినై మెలంగెద.

హిర—మంత్రీ! విప్రజిత్తీ! కుమారా! శంబరా! అమ్మాయకాఁడు యజ్ఞంబులయందును, బ్రాహ్మణులయందును. విష్ణుభక్తులయందును, ఋషులయందును నుండునని తొల్లి శుక్రాచార్యుండు చెప్పఁగా వినియుంటిని. కాబట్టి నేఁ దపంబునకరిగినవెనుకమన

సైనికులం బంపించి, యాయనామధేయుం డంతరించునటు భూలోకమంతయు నాశంబొనరించుమని నాయాజ్ఞగాఁ జెల్పుడు. పుత్రశోకంబున మునింగి పరితపించుచున్న మజ్జననిసూరడింపవలయుఁగాన కుమారా! శంబరా! పోవుదముఁ రమ్ము.

విప్ర—మహాప్రసాదము దేవా!

(నిష్క్రమించుచున్నాఁడు.)

హిర—కుమారా! రమ్ము.

(ఇరువురును నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రథమాంకము.

గీ. ధరణి నయినాపురపు వంశ । తల్లజులగు
బాపరాట్సత్యమాంబల । వరసుపుత్రుఁ
డలఘు సుకవి సోమేశ్వరా । హ్వాయుని చేత
వ్రాయఁబడె నిది భూమిపై । వరలుఁగాత.

శ్రీ

ప్రహ్లాద

ద్వితీయాంకము—ప్రథమరంగము.

స్థలము—అరణ్యము.

[ముందు ఖడ్గధారుఁడై యింద్రుఁడును, వెనుక లీలావతి యును బ్రవేశించుచున్నారు.]

లీలా—(తనలో నాథునుద్దేశించి విరహముతో) హా! నాథా! నాథా! హేమకశిపూ! ముల్లోకంబుల నల్లలాడించెడి బాహుబలశాలీ! దనుజనాయకా! మనోనాయకా!

చ. మది నిసుమంతయైన నను మానముఁ జెందక నింద్రుఁడక్కటా
వదినెయనంగ తల్లియని భావమునం దలపోతమాని, నీ
సుదతిని నన్నుఁబట్టి మన సోకులనెల్ల వధించి వేగ నా
సదనమునుండి దెచ్చె నిటు స్వర్గముఁజేర్పఁగ దుష్టబుద్ధియై.

హా! నాథా! ఇంక నాగతి యేమి? అయ్యయ్యో! శంబరకుమారా! మంత్రీ! విప్రజిత్తీ! మీకందఱకు నియామకుండయిన హిరణ్యకశిపుని పట్టమహిషిని లీలావతి యనుదానను మీరైన నన్నీవిపత్తునుండి గాపాడరారే? అయ్యయ్యో! ఏమి నా వెఱ్ఱి కరచరణబంధంబు గావింపఁబడిన మీరెట్లు నన్నుఁ గాపాడె

దరు? హా! భక్తజనవశీకరా! నా మొఱాలింపవా? భవదీయ
కరుణారసవిశేషాంబువులం దడియుందలంచి యస్మన్మనోహరుం
డల మందరాద్రిపైఁ దప మాచరించుచున్నవాఁడే. అట్టియెడ
నీక్రూరుం డరుదెంచి వావివరుసలనైన గణియింపక నన్నుఁ
జెఱఁబట్టనుంకించెనే. ఆపన్ననై విలపించుచున్న నన్నుఁ బ్రోవనీ
కిదిసమయముకాదా? కోరినతడవుగవరంబులిచ్చుటయేనీవంతు
గానియార్తరక్షణపరాయణుండవుగావా? హా!హంసవాహనా!

సీ. సహధర్మచర్యలన్ । సతతసేవలఁ జేయు
భాగ్యంబు పతియెడఁ । బడయనింక
కొమరుండుగల్గి యీ । కువలయంబును నేలు
ననుమాట కలలోని । దయ్యెనింక
నగుఁబాటుఁ జెందక । నల్వురి లోపల
తలయెత్తి తిరుగుట । గలుగదింక
సధ్రీచులెలజో । సౌభాగ్యగతితోడఁ
బ్రోఁచెడిభాగ్యంబు । వోయెనింక

తే, గీ. ఎవరిఁ బ్రార్థింతు? మ్రొక్కెద । నెవరికిపుడు?
ఎవరుప్రోతురు కరుణతో । నింక నన్ను
పాకశాసను నియ్యెడఁ । బాఱఁద్రోలి
లీలఁ గాపాడువారలు । లేరె భువిని?

(ప్ర) ఓ! వజ్రాయుధస్ఫారప్రశస్తహస్తా! ప్రాగ్దిశాధీశా!

మ. దితిపుత్రుండయి లేనివేళఁగని నా । దీమంబున న్జొచ్చి, నీ
చతురత్వంబును జూపి నన్నకట! నీ । స్వర్గంబున న్జేర్పఁగా
దితిజశ్రేణిని బల్మిబట్టి చెఱ బం । ధింపంగ నీకానె? నా
పతి విన్నన్ నినుఁబట్టి యీడ్చి వెస నీ । ప్రాణంబుల న్దీయఁడే?

మధుసూదనా! స్వర్గమర్త్యపాతాళలోకంబుల కధీశ్వరుండవయి, విశేషించి యమన్యాదిక్పాలక సేవితుండవయి, పదుగురిలో తగుదునని తలయెత్తికొని న్యాయపరిపాలకుండనని చెప్పికొని తిరిగెడి నీవే యిట్లు పరకాంతల బల్మిఁగైకొనఁజూచుటఁ బాడియా? సంక్రందనా! నీవెఱుంగని ధర్మంబులేమిగలవు? ఎవ్వఁడు తన కార్యకారణ సంఘాతమును వశీకరించుకొని, జితేంద్రియుఁడయి వర్తించునో వానికిఁగదా దేవత్వముగల్గును. జితేంద్రియుండవుగాని నీ వెట్లు లిందుర్రిండవయితివో యెఱుంగరాకున్నది. మఱియు నోపాకశాసనా!

చ. వదినెయనంగఁ దల్లియను । వావి యొకింతయునైనఁగాని నీ
హృదయమునం దలంప విది । యెంతటిమూర్ఖత, చెల్లునయ్య! నీ
కిది? పరకాంతనైన నిటు । లేచుట భావ్యముగాదనంగ నీ
వదినెను బల్మిఁబట్టి పలు । బాములుపెట్టుట నీకు ధర్మమే

ఇంద్రు—సద్గుణకల్పవల్లీ! తల్లీ!

ఉ. ఏటికినిట్లు బేలవయి । యీగతి జాలినిఁ దూలెదమ్మ! నే
నేటికి నిన్ను మాల్టెదను । నెన్నఁడు నట్లు దలంపకమ్మ. నా
మాటలు నమ్ముమమ్మ నిను । మాతవిధమ్మగ జూతునమ్మ ! నా
మాటలు తేటతెల్లమగు । మాతరో! స్వర్గముఁ జేరినంతనే!

లీలావతీ! యుష్మన్మనోహరు నేనెఱుఁగకపోలేదు. భవదీయప్రాణనాయకుండును, మేమును, బతితపావనుఁడైనకశ్యపప్రజాపతియనుంగుబిడ్డలమేయయినను, మమ్ముమాతృ మాదితికుమారులు సోదరులట్లు భావింపక హృదయంబున లేనిపోని క్రోధముంబెంచుకొని మమ్ముఁ బెక్కు బాధలంబెట్టఁ జొచ్చిరి. అందులకుభవదీయనాథుఁడే తార్కాణము. దితికుమారులకును, అదితికుమారులకును, సఖ్యముబొసంగుట కలలోనివార్తయని యెఱింగియు

మిగులఁ గ్రూరుండయి వర్తించు నీమనోహరుండు నీమఱఁది వలె జనార్దనునిచే మర్దింపబడక మానఁడనియు, నీవు గర్భవతివిగాన నీకుం జనియించుబాలుండు తండ్రికన్న వేయిమడుంగు లెక్కుడుబాహుబలశాలియయి మున్ముందఱ నింతకంటెపదిరెట్లెక్కువ బాధించుననియు భయంబంది, చూలాలవగు నిన్ను సమయంబునంగాని బంధించుటకువీలు లేదని యెఱింగినవాఁడనై చనుదెంచి నిన్ను బల్మిఁ బట్టి స్వర్గమునకు తోడ్కొని పోవుచుంటి. నీకుఁ బాగండుఁడే గల్గిన వానిని సంహరించితీరెద. లేదేని నీపుత్రికారత్నముతోఁగూడ నిన్ను నీప్రాణనాథునిచెంతకుఁ బంపించివేసెద. నాపల్కులు నమ్ముము. పరమపతివ్రతాశిరోమణివగు నిన్ను వేఱొండు దురుద్దేశంబుతో బలాత్కారముగాఁ దోడ్కొనివచ్చితినని యనుమానింపకుము. దేవదానవులకు మైత్రి పొసఁగు టాకాశహర్మ్యంబుగాన నీయెడ నిట్టికార్యమొనరింపవలసివచ్చినందులకు నన్ను మన్నింపుము.

లీలా—శతధృతా! తొలుదొల్త నీ మనువుంగని నేనపభ్రమఁజెంది నిన్ననేకవిధంబులఁ దూలనాడితిని. శతమన్యూ! నాతప్పుసైరింపుము. మఱియు నో యమరనాయకా!

సీ. నను బల్మిఁ బట్టెద । ననుకొంటి తొలుదొల్త
నదిగాక నీవిప్పు । డంతకన్న
ఘనమైన కార్యమే । మనమునఁ దలపెట్టి
చెఱఁగొని తెచ్చితే । శీఘ్రగతిని
పౌగండునిం జంపఁ । బ్రాణముల్ నాయవి
పోవక నిల్చుట । బొసఁగదయ్య!
శిశుహత్యకును దోఁడు । స్త్రీహత్యయునుఁగూడఁ
బట్టి బాధించు జం।భారి నిన్ను

తే. గీ. మాతవిధమునఁ జూతు నఁటని మాట యిచ్చి
బాలకునిఁ ద్రుంతు ననిపల్కఁ । బాడి యగునె?
సుతులఁ గనలేదె? దయలేదె? । పతిభతిలక!
నిర్ఘృణుని రీతిఁ బల్కఁగా । నిర్జరేంద్ర!

వెండియు నోసునాశీరా! (విచారముతో బ్రతిమాలును.)

ఉ. గర్భములోని పుత్త్రకుని । కాంక్ష వధింతు నటంచుఁబల్కఁగా
నిర్భర పుణ్యమూర్తివి, సు । నీతివి, నీకిది చెల్లునయ్య? నన్
దుర్భరశోకవార్ధి బడఁ । ద్రోయకుమయ్య! భజింతునయ్య! నిన్
స్వర్భువనాధినాథ! యన । వద్య కృపామతిఁ బ్రోవవేఁడెదన్.

ఇంద్రు—లీలావతీ!

శా. చండక్రోధముతోడ దైత్యులు మమున్ । సంహారముం జేయ ను
ద్దండత్వంబునఁ జూచుచుండెడి మహో । దగ్రాత్ము లౌ వీరినిన్
ఖండింప న్వలెనంచు నెంచితి మదిన్ । గాఠిన్యమే పార నా
యండన్బల్కకు బ్రోవుమన్న పలుకో । యజ్ఞాతపత్రేక్షణా!

మఱియు, నో మహాపారత్నమా!

తే. గీ. దేవతల పేరుఁ జెప్పిన । నేవగించు
పరమమునులను గనుఁగొన్న । బాధపెట్టు
చెనఁటిదైత్యాధములఁ బట్టి । దునుముపట్లు
పాపమున్నను భయపడు । వాఁడఁ గాను.

కాఁబట్టి నీవు నాయెదుట నిం కేమియుం బలుకక నావెనువెంటనే
రమ్ము. మహాపతివ్రతవు, సద్గుణనికురంబవు గాన నీకింతదూ
రము చెప్పవలసివచ్చె. మఱియు,

తే. గీ. వక్రమార్గాన నడచెడు । చక్రపాణి
-యైన దండనంబున కర్హుఁ । డౌనసంగ

వసుధ బుట్టినదాదిగా । వక్రగతినె
నడచుచుండెడి మీవారి । విడువఁదగునె ?

కావున నో దైత్యేశ్వరీ! నీప్రార్థనలన్నియు నాయెడ వ్యర్థంబులయ్యెనని మదిఁ దలంపక ముందు నడువుము.

లీలా—ఓ ! మహేంద్రా! (విచారముతో) కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యంబు లనుపాశంబులం దగులంజేయు రాజ్యముఁ బడయందలఁచి నీసమానులతో యుద్ధ మొనర్చి జయంబుంగాంచవలెను. అందులకుం దగిన సమర్థత లేదేని యొక మూల నొదిగియుండవలయును. పురుషుండవయి జన్మించినందులకు నీపౌరుషంబుఁ దగినమగవారిపైఁ జూపిన రాణించునేగాని మావంటి యబలలపైనను, శంబరాదులవంటి బాలురపైనను జూపుటఁబాడియా? ఇది యేటిపౌరుషము ? ఇది యేటిధర్మము? రాజనీతి నీ వెఱుఁగవే? ఓ పాకశాసనా! సంతతి లేదని మంతనమున నింతింతనరాని పరితాపంబున గ్రుమ్గుచుండగాఁ దుదకు పరమేశ్వర కరుణాకటాక్షవీక్షణంబులు నేఁటికి నాపైఁ బ్రసరించి, నాకోర్కె ఫలించునోయనునటుల దౌహృదముం దాల్చితి. నాకర్మము మూర్తీభవించెనోయనునటుల, నాపాలిఁటి మృత్యుదేవతసాక్షాత్కరించెనోయనునటుల, వడివడివచ్చి నా గర్భములోని బిడ్డనుం జంపెదననుచుంటివే? స్వకీయపరకీయ భిన్నాభిప్రాయంబున నొరెఱుంగని పసికూనలం జంపుటేటినీతి? అందు గర్భముననున్న నర్భకునిజంపు టేటిధర్మము ? కఠిన హృదయుండవగు నిన్నేమనందును? నీ హస్తమునందున్న యాయుధమే వజ్రముగాని నీహృదయముగాదనుకొంటినే? నీపల్కులశనిపాతంబులే ? నిన్నెన్నివిధంబులం బ్రతిమాలినను నాయారాటముఁ బాపవైతివే? అట్లయిన నోసునాశీరా! ఇటువినుము.

నన్ను బందిగమం దునిచితిగదా నాకుఁ గల్గిన సుతుని సంహ రింతుననుచుంటివి? కన్నపుత్రునితోఁ బాటు నేనును మడియుట నిక్కమముగదా? నేఁడు నీకంతశక్తియు లేకుండనీవజ్రాయుధముచే నన్నే ఖండింపరాదా? నాచావుతో నీకోరికెయు నెఱవేఱు ? ఎట్లయినను శిశుహత్యయు, స్త్రీ హత్యయు నీకుఁ దప్పవుగాన నిట్లు చెప్పితిని. అట్లు చేసితివేని నాకుఁగలదుఃఖము త్వరలో రూపుమాపినవాడవగుదువు. బాలుంజంపఁ గృతనిశ్చయుండవై తివి గాన నా యీ చిన్నికోరికె నెఱవేర్పుము.

ఇంద్రు—లీలావతీ! భరింపరాని పుత్రశోకంబున నీవు మడసినమడ సెదవుగాక; నా వజ్రాయుధముచే ని న్నేటికి వధించెదను. నా వాక్యంబుల కడ్డుపల్కక నడునడు- నా కాలస్యంబగుచున్నది.

లీలా—(దైవమునుద్దేశించి) ఔరా! విధాతా! నీవెంతకైనం దగు దువు. సంతతికొఱకై వగఁజెందుచున్న నాకెంతయు నాసఁ గల్పించి, ముద్దుముచ్చటలైనం దీరకమునుపే వైకుంఠరూపం బునీ నాశిశువు నపహరింపఁజూచితే? ఇంతమాత్రమునకే నా కింతయాసఁ గొల్పనేల? ఈగర్భోత్పత్తియే లేకున్న నేవిచార మును లేకుండ నుందునే? అయ్యయ్యో! నాకేదిదారి? ఎందుఁ బోదును?ఏమిచేయుదును? ఎవరు నన్నుం గాచెదరు?(బిగ్గరగా) ఈశ్వరా ! మానీశ్వరులారా! మీరైనవచ్చి నాయీకష్టంబున కడ్డుపడరే ?

క. పలుమఱుఁ బ్రార్థించినఁ దన
దలఁచినపని మానఁ డకట ! దర్పోద్ధతుఁడై
పొలఁతిని ననుఁ గావఁగ నీ
బలసూదను నుద్యమంబు ! వారింపరొకో ?

[ప్రవేశము: నారదుఁడు]

నార—ఎవ్వరి దీయార్తధ్వని? (తేఱిఁ బాఱిచూచి) ఇంద్రా! ...గుణసాంద్రా! ఆగుమాగుము. ఏమిపనిఁగావించితివి? అబలల నిట్లే డ్పించుట భావ్యమా? ఈమె రాక్షసాంగనయయ్యుఁ గడు నుత్తమురాలు. పతివ్రత. ఖ్యాతయశోవలంబ. అట్టి తన్వియెడ నిట్టికూరకార్యముం గావించుటేటినీతి? చాలు చాలు. అవక్ర విక్రమ పరాక్రముండగు హేమకశిపుని యర్థాంగియసియైన నెఱుఁగ కెట్టికార్యము గావింపనెంచితివి? ఇఁక నీమెను విడిచిపెట్టుము. (లీలావతిదిక్కు-తిరిగి) అమ్మా! నీకేమియు భయంబు లేదు. వగపుఁదక్కి-యుండుము. భయంబు లేదూరడిల్లుమూడిల్లుము.

లీలా—మునిసార్వభౌమా! భవద్దాసురాలు లీలావతి యిదే ప్రణమిల్లుచున్నది. కైకొనుఁడు. ఋషీశ్వరా! భవదాగమనముచే ధన్యురాలనైతిని. నాకష్టంబు గట్టెక్కె-. నానోము ఫలించె భవదనుగ్రహంబువలన నాప్రాణంబులు నిల్చినవి. మదీయప్రాణనాథుని వదనసందర్శనముఁ జేయగలనను ధైర్యముజిక్కి-నది.

నార—అమ్మా! పుత్రవతి వగుదువుగాక. భయపడకుము. నీమనోనాథు నచిరకాలంబులోననే చూడఁగలవు. నీకష్టంబులు గడచె; సుఖంబుగ నిల్లుచేరుదువు.

ఇంద్ర—సురమునీంద్రా! తమరిట్లేల పల్కు-చుంటిరో నేనెఱుంగఁజాలకున్నాఁడను. నే నీమెయెడ ద్రోహం బేమియుఁ దలంచియుండ లేదు. ఆ యంశం బీవఱకే లీలావతికెఱింగింపఁబడియె. ఈమె మహాపతివ్రతయనియు, దుష్టరాక్షసుండగు హేమకశిపుని యర్థాంగియనియు, నే నెఱుంగకపోలేదు. నాయుద్యమం బేదియో దేవర యెఱుంగ కిట్లసంగతంబుగా బల్కు-ట భావ్యమా?

నార—అట్లయిన నీమె నెందుల కిట్లు చెఱపట్టితివి?

ఇంద్రు—బ్రహ్మమానసపుత్రా!

క. లీలావతి గర్భంబున
బాలుం డుదయించెనేని ♦ బాధించునటం
చాలోచనమెయి నేన
బ్బాలుని వధియింపనెంచి ♦ బట్టితినఘా!

నార—(కొంతవడి దివ్యదృష్టిఁ దిలకించి యపవారించి) మహేంద్రా! ఇటువినుము. హేమకశిపునిపుత్త్రుండైనను నిబ్బాలుండు పరమభక్తాగ్రేసరుండు, తత్త్వజ్ఞానసంపన్నుండు. నిర్మలుండు. మహావైష్ణవాంశసంభూతుండు. అట్టివాఁడెట్లు నీకపకారంబొనర్చును. దానవకులమందుద్భవించుచుండె ననినంతమాత్రమునకే వెఱపుగొనవలసినపనిలేదు. నావాక్యంబులయెడ విశ్వాసముంచుము. మఱియు నీకింకొక్క పరమరహస్యం బెఱింగించెద. ఈ బాలుండు జన్మించిననేగాని హేమకశిపుఁడు మడియఁడు. హిరణ్యాకశిపుఁడు జగత్కంటకుఁడు. వానికుమారుఁడు విష్ణుభక్తుఁడగును. హిరణ్యాకశిపుం డిపుడు మందరాద్రిపైఁదపంబాచరింపుచున్నవాఁడు. వాణీమనోహరునివలన దుర్లభంబులగు వరంబులఁ బొందితీరును. భగవద్దూషణమొనరించిననేగాని వాఁడు మడియడు. అందువలననే కుమారుండు విష్ణుభక్తుండుగాన విష్ణువుని భజింపవలదని కుమారుని దండించును. అనేకబాధలం బెట్టును. తన భక్తుండగు బాలునిం బాధించెనన్నరోషంబున నాదిదేవుండగు విష్ణు వారాక్షసాధముని—(అని యిటునటుం జూచి) ఈచుట్టుఁపక్కలేరును లేరుగదా? మహేంద్రా! ఇది పరమరహస్యంబుగా నుంచవలయునుఁజుమా? ఇంకవినుము. ఆరాక్షసాధముని నారసింహావతారంబున నంతంబొనరించును. హిరణ్యాకశిపుని మరణం బీరీతిగా నుండుటచేతనే యీవా

గర్భంబున భగవంతుండగు నయ్యనంతుని భక్తుం డుదయించు చుండె. కాఁబట్టి యీమె నిటడించి హేమకశిపుని ప్రాణంబు నకై యెదురుచూచుచుందుము. పొమ్ము,

ఇంద్రు—(అపవారించి) సురమునీంద్రా! సంసించితిని. మహాత్మా? మహామహుండగు నాదిదేవుని భక్తుం డీమెగర్భమునం జని యించునని యెఱుంగ కపచారం బొనరించితి నాతప్పు సైరిం పుఁడు. భవదాజ్ఞానుసారంబుగా మెలంగెద. (కొంచెముదగ్గఱగాఁ జని) ఋషిపుంగవా! ఎంతకాలంబున కారాక్షసాధముం డంత మొందును? ఎటింగింపఁదగునేని హామనశ్శల్యమయినయీయం శమెటింగింపఁ బ్రార్థితులు.

నార—(అపవారించి) సహస్రాక్షా! కాలనిర్ణయముం జేయ నవకాశ ముచాలదుకాని. (చెవిలోచెప్పుట నభినయించి) ప్రకా-మహేం ద్రా! నాకనుష్ఠానంబునకు వేళ యతిక్రమింపఁజొచ్చె. కావున నీవిఁకఁ బొమ్ము. ఈమెతో నే వెడలెద.

ఇంద్రు—(ప్రకాశముగా) తాపసోత్తమా! నిష్కారణము తమ కేల శ్రమ నైకొననలయును? తమరు సెలవొసంగెద రేనిమరలనీమె గృహంబున నీమెనుడించి నాపట్టణంబున కేను బోయెదను.

నార—వలదు. వలదు, నీదారిని నీవుబొమ్ము.

ఇంద్రు—చిత్తము. (అని లీలావతిదిక్కు-) అమ్మా! లీలావతీ! నన్ను మన్నించి నాకు సెలవొసంగితివేని పోయెద.

లీలా—మహానుభావా! శతమన్యూ! నాయందు నిప్పటికైనం దయ దలంచితి వంతియేచాలును. భవదీయానుగ్రహంబువలన నా శిశువు నాకుఁ దక్కె, సంతసించితిని.

ఇంద్రు—మునిపుంగవా! నమస్కారము. సెలవు దయసేయుఁడు.

నార—ఇష్టఫలసిద్ధిరస్తు. మంచిది పోయిరమ్ము.

ఇంద్రు—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

లీలా—(సంతోషముతో) మునీంద్రా! భవదీయకరుణావిశేషం బే మని పొగడుదును. వజ్రహృదయుండగు వజ్రపాణిహస్తంబుల నుండి సునాయాసంబుగా నన్నుఁగాపాడితిరి. తమయనుగ్రహ ముకతంబున మఱల భూలోకంబునఁ బునర్జన్మముఁ గంటి. ఋషి పుంగవా! మఱల బాటమధ్య నిబ్బలారి యడ్డుకొని నన్నుం దోడ్కొనిపోకుండ సురక్షితంబుగా నామందిరముం జేర్చి నాకొలది మర్యాదలం గ్రహించి నన్ననుగ్రహించుఁడని వేఁడుచున్నాను.

నార—అమ్మా! లీలావతీ! నీమనంబున నట్టి సంశయంబు వలదు. శత మన్యుఁ డికఁ నిన్ను బాధింపఁడు. నీమనోహరుండు తపో మహాత్మ్యంబున సత్యలోకాధీశుని నొప్పించి దుర్లభంబులగు పెక్కువరంబులబడసి గృహంబున కచిరకాలంబులోననే రానై యున్నవాఁడు. నీప్రాణనాథుండు గృహంబునకు వచ్చిన వెం టనే నిన్ను నీగృహంబునకుం జేర్చెద. అంతదనుక నీవు నాయా శ్రమంబుననే సుఖంబుందువుగాని రమ్ము.

లీలా—తాపసాగ్రగణ్యా! భవదాజ్ఞానువర్తినినై మెలంగెద.

నార—అటులయినఁ బోవుదము రమ్ము. (నిష్క్రమింతురు.)

ద్వితీయరంగము.

స్థలము — నారదాశ్రమము.

[లీలావతి శయనించియుండఁగా, నారదుం డిటునటు నడయాడుచుఁ ప్రవేశించుచున్నాడు.]

నార—మఱియు నాదిమధ్యాంతరహితుండగు నమ్మహావిష్ణువే సుర గణంబులకును మహర్షులకును నాదిదేవుఁడు గావనజుండనియు

ననాదియనియు తురీయరూపుఁడైన యజ్ఞానతమోభాస్క రుండగు నమ్మహేశ్వరుండనియు నెవ్వఁ డెఱుంగునో యాతఁ డే సమ్మోహము లేనివాఁడగుటవలన సమస్తపాపంబులచే తను విముక్తుండగును. సుమనోమార్గంబుల కచింత్యంబయిన యాచిదానందుని లతితాధ్యాత్మికవిషయజ్ఞానసంపత్తియే పాప సంహారణోపాయంబుగాఁ జెప్పంబడియె. సంసారరహితులకు గర్మకృతమయిన యచిత్సంసర్గమే జన్మము. కార్యకారణావస్థ మగు నచేతనముకన్నను బద్ధయుక్తమగు చేతనముకన్నను నీశి తవ్యమగు సమస్తముకన్నను నిఖిలహేయప్రత్యవనీకానవధికా తిశయకల్యాణైకవితానుం డగుటచేతను నియమనైకస్వభా వుండగుటచేతను యితర సజాతీయుఁడను మోహము లేని వాఁడై యెవ్వఁడు పరమాత్మనెఱుంగునో యాతఁడేసర్వపాపం బులచేతను విముక్తుండగును. మెఱియు సర్వప్రాణంబులకును బుద్ధి, జ్ఞానము, అసమ్మోహము, క్షమము, శమము, దమము, సత్యము, దుఃఖము, సుఖము, భావము, అభావము, భయము అభయము, అహింసము, సుమతము, తుష్టి, తపస్సు, దా నము, యశము, ఆశయంబులగు నిరువదిభావంబులును భగ వంతుని యనుగ్రహంబునలననే కలుగుచున్నయవి గావుననే యమ్మహానుభావుని లోకమహేశ్వరుం డని యెఱుంగుము. (మధ్య మధ్య ఊఁ. ఊఁ. అను ధ్వని వినంబడునటు లభినయించి తేఱిఁ బాఱజూచి) ఏమిది! లీలావతి సుషుప్త్యవస్థం దగిలియున్నదే? నాతత్త్వబోధ నెవ్వని యెవ్వ రీయూకొట్టు చుంట? (అని యిటునటుఁజూచి) ఈచుట్టుపక్క లేరును గాన రారే? (అని దివ్యదృష్టిఁదిలకించి) హే! మహానుభావా! లీలా వతి గర్భంబునం బ్రవేశించి నీవేనా నావాక్యంబు లాలించి

యూకొట్టుచుంట? ఓ పరాత్పరా! ఆదిమధ్యాంతరహితా! నిత్యానందపయఃపారావారంబున నోలలాడించెడి పరమాత్మస్వరూపకా! నీ వుపదేశించిన యంశంబులనే నావలన వినఁ గోరుచున్నాఁడవా? అట్లయిన వినుము. వెండియు, నమ్మహావిష్ణువే పరబ్రహ్మము. సర్వజగత్తునకుం గారణభూతుఁడు. అతనివలననే వికారరూపంబయిన సర్వజగత్తును బ్రవర్తించుచున్నయది. అమ్మహాతేజశ్శాలియందుననే భక్తినుంచి, సర్వేంద్రియంబులుఁగూడ నాతనియందు నిలిపి యమ్మహనీయ వర్ణనాపూర్ణులై యప్పరమాత్మనే యొండొరులకు బోధించుచు, తమతోడివారల కుపదేశించుచు నిరంతరము సంతోషించువారలకే సుఖముగలదు. అట్టిసుఖమే సుఖము. ఆ యానందమే బ్రహ్మానందము. భగవద్భజనమునందు సాధనము ను సాధనాంతరముం గూడగలదు. అట్లమ్మహావిష్ణుని సంతత మేకాగ్రతగలవారలై పరమప్రీతితో నుపాసించి యెవ్వరు భజించుచుందురో వారల కాపరమాత్మ తన్నొందుటకు సాధనమైన బుద్ధియోగంబు దయసేయును. ఎవ్వరు భగవంతునియం దేకాగ్రమయిన బుద్ధిగలవారలై స్వార్థపరోన్నత్యాదు లగువాని నపేక్షింపక ప్రీతిపూర్వకముగ సేవించుచుందురో యట్టివారి కచింత్యంబయిన సమ్యగ్దర్శనమును దయసేయును. అట్టివారినే యనుగ్రహించుటకై భగవంతుం డెప్పుడును వారి యంతఃకరణవృత్తియందే వసించుచుఁ బ్రకాశమానం బగు జ్ఞానదీపముచే వారి యవివేకజన్యమగు మిథ్యాజ్ఞానం బను నంధకారమును నాశనముం గావించి బుద్ధియందుఁ బ్రకాశించు పెన్వెలుఁగను జ్ఞానముం దయసేయును. నాలుగు వేదంబులలోనను వీణామృదుధ్వానంబుచే మిక్కిలి రమణీయ మగు సామవేదంబును సర్వదేవాధి

పతియగు వైరంతేశుండును, పదునాకం డింద్రియములలో పవిత్రకమైన మనస్సును, సర్వప్రాణి సంబంధములగు పరిణామములలో జిదభివ్యక్తమైన బుద్ధివృత్తియు భగవంతుండగు విష్ణువేయని యెఱుంగుము. (అని యిటునటుఁజూచి) ఓహో! అప్పుడే సాయంసమయము గావచ్చినదే? ఇఁక నే నరిగి కాల్యకృత్యంబుల నెఱవేర్చికొందుఁగాక. హేమహానుభావా! మిగిలినయంశంబులు తే పుపదేశించెద. ఇప్పటికినాకు సెలవు దయసేయుము. (నిష్క్రమించుచున్నాఁడు.)

తృతీయరంగము.

స్థలము:—హిరణ్యకశిపునిసభ.

[హిరణ్యకశిపుఁడు, శంబరుఁడు, విప్రజిత్తియు నుచితాసనములపైఁ బ్రవేశింపుచున్నారు.]

విప్ర—దేవా! తదనంతరం బేమిజరిగెను?

హిర—తరువాత నాతపస్సునకలరి యాస్వయంభువు సాక్షాత్కరించి "హిరణ్యకశిపూ! నీతపంబునకే నెంతయు మ్మెచ్చితి. నీ కిష్టంబగువరం బెద్దియో వాంఛింపు మనియె.

శంబ—(సంతోషముతో) తండ్రీ! అప్పుడు మీరు నాతండ్రింజంపిన యామాయాకారుని జయించునట్లు వరంబడిగితిరని తలంచెద.

విప్ర—కుమారా! తపంబునకై వెడలినదే యందులకు గదా?

హిర—కుమారా! శంబరా! మంత్రీ! విప్రజిత్తీ! యట్లుకాదు. నే నడిగినవరంబులవలన సమస్తమయినవారినిం గెలిచెదను. ఆ విష్ణు వొక్కండే యననేల? త్రిభువనంబులయందును నన్నెదిర్చి పోరంగల ధీరుం డొక్కండైన నుండునే?

శంబ—అట్లయిన నవ్వరంబు లెవ్వియో వినఁగోరెదము.

హిర—మంచిది వినుండు.

శా. "గాలిం గుంభిని నగ్ని నంబువుల నా । కాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములన్ దమఃప్రభల భూ । రిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహ । వ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేనిజీవనము లో । కాధీశ! యిప్పింపవే?"

(భాగవతము.)

మఱియు, రణముఖంబున నాకెదురులేని ధైర్యస్థైర్యంబులును, దిక్పాలుర నెల్ల జయించునట్లును, లోకత్రయంబులయందును నాకెదురు లేనట్లును, వరంబులంగోర హంసవాహనుండలరి "వత్సా ము న్నెవ్వ రిట్టి ఘోరతపం బాచరించి యుండలేదు. ఇట్టివరంబులంగూడ బొందియుండలేదు. మహాతపం బొనరించి నన్ను సంతోష పరచితివిగాన నీకోరినవరంబులు నీకనుగ్రహించితి. బుద్ధిసంపన్నుండవై రాజ్యభారంబు వహించి సుఖంబుండు" మని యానతిచ్చి యంతర్హితుండయ్యె.

విప్ర—ఎహావ్వా! మన మెంతయు నదృష్టవంతులము. ముల్లోకంబుల మనల నెదుర్చు దుర్జయు లుండరు. అట్లయిన దేవరవారిక సోదరుం జంపిన యాహరి మద మడంచుటకుఁగాను యుద్ధము నకై సంసిద్ధులరై యుంటి రని యూహించెదను.

శంబ—అంతకన్న కర్తవ్యం బేమిగలదు?

హిర—ఆగు నగును. నాయీ సంతోషకరం బైనవార్తను నా ప్రేయసికింగూడఁ దెల్పి, యాపైన దండయాత్రకుం బోవు వాఁడను. కాన నే నంతిపురంబునకుఁ బోయెద. మీరు మీమీ నివాసంబులకుఁ బొండు. (అని లేచుచున్నాఁడు.)

శంబ—(హిరణ్యకశిపుని కాళ్ళపైఁబడి) తండ్రీ! పిఱికిపందలమై మా తల్లియగు లీలావతీదేవిగారిని పరుల కొప్పగించిన యీసేచుల తప్పు మన్నింపుఁడు.

హిర—(నిర్ఘాంతపడి మహాకోపముతో) ఏమిరా! యీ దుర్భాషలు! నీతల్లిని పరుల కొప్పగించితివా? ఛీ! ఛీ! రాక్షసకులమును జెరుపఁ బుట్టితివా? ఆహా! తల్లీ! దితీ! నేఁటికి నీసంతతికి "పిఱికి" యను మూఁడక్షరంబులు బహుమతిగా వచ్చినవి. ఔరా! శంబరా! కులంబునకెల్ల మచ్చఁదెచ్చి నీ వె ట్లీప్రాణంబులంభరియించి జీవించియుంటివిరా మూర్ఖా! (తలపంకించుచు) సరియే కాని ముం దీమాటఁదెల్పుము. హిరణ్యకశిపుని కపకారం బొనరించి యమలోకమునకుఁ ద్రోవఁ జేసికొనిన యాచెనఁటి యెవ్వఁడో ముందుగాఁ దెల్పుము?

శంబ—తండ్రీ!

మ. ఖలుఁడై దుర్మదచిత్తుఁడై విపులమా । కానూతురుం డైచు న
ప్పలుగాకైన బలారి వచ్చియు వెసన్ । బంధించి మమ్మందఱన్
కలహంబందు నెదిర్చి పోరుటకు నొక్కండైన లేకుంటచే
లలనన్ దోడ్కొనిపోయె నక్కటకటా! । లబ్ధవ్యమందన్ ప్రభూ!

హిర—(కోపముతో) ఓరోరి! మహేంద్రా! నిన్నిదివఱకే మఱియింపక విడిచినందులకుఁ దగిన ఫలం బొనఁగూర్చితివి.

శా. దుర్జాతుండవు దుర్మదాంధుఁడవు బం । ధుధ్వంసన్నిఘ్నుండవో
పర్జన్యా! మునిభార్యచందమున నా । భార్యామణిన్ దుష్ప్రభా
ఖర్జపక్రియఁ బట్టినాఁడవుగదా । గర్వంబుచే నింక నిన్
నిర్జింపన్వలె నిద్రఁబోవలయునో । నిర్గంధసర్వాధిపా !

విప్రజిత్తి! అర్ధరాత్రంబు దేయభిప్రాయంబున ననికి సిద్ధంబయ్యె. అతఁడొక్కండు వచ్చి మిమ్మందఱ నిర్జించెనా? ఏమి యీవింత ?

శత్రువులకు జడిసి ప్రాణంబుపైఁగల తీపిచేఁ బ్రాణంబుల
నక్కించుకొనిన మీవదనంబులు చూడరాదు.

విత్రి—మహాప్రభూ! మావాక్యంబు లించు కాలించినపిదప మీ
యిచ్చవచ్చిన ట్లానరింపుడు. మే మెంతమాత్రము ప్రమత్తు
లమై మెలంగలేదు. కాని—

సీ. పర్జన్యుఁ డెంతయో । పంతంబుతోడ శి
లావర్షమునుగుప్పె । లాఘవమున.
అగ్నిదాఁ జెలరేఁగి । భగ్నంబు గావించెఁ
గొంపలన్నియుఁగూడఁ । గూలునట్లు
నైరృతుం డక్కటా! । నైస్త్రింశికుండయి
పరిపంథినులనెల్ల । నఱుకఁజొచ్చె
యామ్యదిశాధీపుఁ । డయ్యయో పాశాన
దితిజుల ప్రాణముల్ । దీయఁదొడఁగె

తే. గీ. తక్కుఁగల దిక్పతుల్ మమ్ముఁ । దరుముచుండ
నాజి వారలఁ గెల్వఁగా । నగునె మాకు?
నెట్టులున్నను త్రిదినంబు । లెట్లొ మేము
పోరియుంటిమి లేకుండఁ । బోయె గెలుపు.

అష్టదిక్పాలకు లేకమయి పట్టణంబెల్ల నల్లకల్లోలం బగునటు లొన
రింపఁజొచ్చిరి. మా కోటమి సంభవించినంతనే మమ్ములం
బట్టి బంధించిరి. తరువాత మరుసటిదినంబున దేవిగారి చెలిక
త్తియ యొకర్తు కాన్పించి దేవిగారిని "బలాత్కారముగా
స్వతాత్రిముందు దోడ్కొనిపోయె" నని చెప్పె. మఱికొన్నిదినం
బులకు మన సేనానాయకుం డగు సహస్రాక్షుం డరుదెంచి
మమ్ముల బంధంబుననుండి తప్పించె. అప్పటినుండియు మఱలఁ
బనిచేయుచుంటిమి.

హిర—అట్లయినయెడ మీయం దిసుమంతయు నేరంబులేదు. (క్రోధముతో) అరరే దిక్పాలకులారా! ఏమిరా మీకండకావరము. హేమకశిపుం డింకను జీవించియుండె ననుమాట మఱచితిరే? కానిండు. మీరొనర్చిన దుష్కార్యమునకు దగిన ఫలం బనుభవింతురుగాని తొందరం జెందకుండు. (విచారముతో) హా! పురంధ్రీరత్నమా! లీలావతీ! దురాత్ముండగు నులూకునిహస్తంబులంబడి యింకను జీవంబులతో నుందువే? హా! మనోహారిణీ! నీవే మడసిన నా కీకాయముతో నేమిపని? అయ్యయ్యో! పౌగండుండో పుత్రికయో గల్గి యాయానందంబున మాతాశిశువు లుందురని కొండంతయాసతో వచ్చుసరి కశనిపాతంబువోలె నీఘోరవార్త వినంబడియె. హా! అర్ధాంగమా! నిన్ని జన్మంబునం జూచు భాగ్యము నాకు లేదే? హా! పద్మాయతాక్షీ! కమలాసనుం డిచ్చిన వరంబు లేరితోం జెప్పుదు? ఎవరు విని సంతసింతురు?

విప్ర—దేవా! ఇట్టియెడ విచారించిన నేమిప్రయోజనము? త్వరితగతి మీరరిగి నయ్యిందుని గర్వంబడంచి శ్రీదేవిగారిని దోడ్కొనివచ్చుట వీరపురుషోచితంబని దలంచెద. మీదదేవరచిత్తము.

హిర—విప్రజిత్తీ! శోకాంధకారంబున మునింగి పరితపించుచున్న నాకుం జక్కని యాలోచనం జెప్పితివి. మీరు మీమీగృహంబులకుంబొండు. నేనొక్కండ నరిగి సహస్రాక్షునిమద మడంచివచ్చెద. (అని తొందరగాం బోంబోవుచుండంగా)

[దుర్ముఖుండు ప్రవేశించి]

దుర్ము—దనుజనాయకా! జయము జయము.

హిర—ఓరీ! భార్యావిరహితదుఃఖాబ్ధి మునింగి పరితపించుచున్న మా కేమి జయంబుగల్గెనో వేగం జెల్పుము?

దుర్ము—దేవా! అమ్మగారగు లీలావతీదేవిగారొక బాలకునితోడను యెవ్వఁడో యొక మునితోడను వచ్చి భవద్దర్శనార్థమయి ద్వారంబున వేచియున్నారు.

హిర—(సంతోషముతో) ఏమిరా! నిజముగా లీలావతియేనా! నీవు భ్రమజెందలేదుకదా! చెప్పుము. ఏమేమీ! నిజముగా నా బహిఃప్రాణమగు లీలావతియేనా?

దుర్ము—దేవా! దనుజకులకంఠీరవులగు తమతో మఱియొకలాగున మనవి యొనర్చెదనా?

హిర—ఓరీ! దుర్ముఖా! దుఃఖాంబుధిని మునింగియున్న మాకు సంతోషవార్తం దెల్పినందులకీ బహుమతిం గైకొనుము. (అని యొక రత్నహారమిచ్చి) వేవేగ వారి ప్రవేశము నడుపుము.

దుర్ము—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాడు.)

[ముందు లీలావతి పుత్రునితోడను, వెనుక నారదుఁడును ప్రవేశింపుచున్నారు]

లీలా—(హిరణ్యకశిపుం జూచి వడివడిఁ జని పాదములపైఁబడి కన్నీటితో) ప్రాణనాయకా! మీయర్ధాంగియగు లీలావతి యిదే ప్రణమిల్లుచున్నది గైకొనుఁడు. మనోహరా! మహామహుండగు నీనారదమౌనీంద్రుఁడు మనకుఁ బెట్టిన పుత్రభిక్ష యిదే తిలకింపుఁడు.

సీ. ప్రాణేశ! నినుఁ జూచు । భాగ్య మీజన్మంబు
నందు లేదం చెదఁ । గుంది కుంది
తుదిసారి మనసారఁ । బదముల కతిభక్తి
మ్రొక్కఁగా గరములు । మోడ్చి మోడ్చి
కడసారి నీమూర్తిఁ । గాంచఁగా మది నెంచి
లలితాంగ దృష్టిని । నిలిపి నిలిపి

నీపాద సేవయే । నెమ్మితో నొనరింప
నాత్మేశ ! యీదేహ । మూపి యాపి
తే. గీ. బ్రతికి యుంటిని జీవచ్ఛ । వంబువలెనె
నారదాశ్రమమందు నో । కూరిమిసఖ !
యిన్నినాళ్ళకు నాకోర్కె । లెల్లఁ దీఱె
శారదానందను గృపాతి । శయముకతన.

హిర—(బాలుని దీసికొని ముద్దుఁబెట్టుకొని) దానవకులోద్ధారకా! నీకు శుభం బగుఁగాక. (లీలావతీభుజములపైఁ జేయివైచి) మనోనాయకీ! కడచినదానికిఁ జింతింపకుము. చింతఁదక్కి యుండుము. మఱలఁ బ్రాణంబులతో మనమిరువురముం గలసి కొంటిమంతియే చాలును. కానినీయెడ నపచారంబొనరించిన యాదుండగునిమాత్రయు సంహరించితీరెద. ఆయంశం బటుం చుము. ఏమంటివి? నారదమౌనీంద్రుని కృపాతిశయంబున మన కీపుత్రలాభంబు కల్గినదనియా? సంతోషము సంతోషము. (అని నారదునిదిక్కై) నారదమౌనీంద్రా! ఇంకను నిలు వంబడియే యుంటివా? ఇట కూర్చుండుము. దేవీ! నీవీయాస నం బధిష్ఠింపుము. (అని కూర్చుండి బాలుని ముద్దుపెట్టు కొనును.)

నార—దానవనాయకా! చిత్తము. (అని కూర్చుండును.)

లీలా—(కూర్చుండును.)

హిర—(తలపంకించుచు) నెచ్చెలీ! దుర్మదాంధుండగు స్వర్గాధిపుని బారినుండి యెట్లుతప్పించుకొంటివి? కఠినహృదయుండగు వజ్ర పాణి నిన్నేమియుం బాధింపలేదుకదా? నారదుని సమావేశ మెప్పుడైనది ?

లీలా—నాథా! నేను చెలికత్తియలతోఁ బ్రమదావనంబున నుండగా

శచీనాథుం డరుదెంచి మిమ్మును, మీవంశంబును ననేకవిధం
బులం దూలనాడి, నన్నుగూడ నిందించి—

హిర—ఏమేమీ! నన్నును నావంశంబును గూడ నిందించెనుగా?
ఏమి వాని కండకావరము?(కోపముతో)ఓరోరిమహేంద్రా!
నీవును, మేమును కశ్యపప్రజాపతిబిడ్డలమేకదా? తల్లులిరువురు
గానితండ్రి యొక్కఁడేకదా? అట్టియెడ నావంగడమే చెడ్డ
దైనయెడల నీవంశముమాత్ర మంత యుత్కృష్టమయినదేమి?
ఛీ! ఛీ! నీతో నాకు వృథా కంఠశోష యెందులకు? నీగర్వం
బు సర్వంబు ఖర్వంబుగా నొనర్పకున్న న న్నీ హేమకశిపాభి
ధానంబునం బిల్వకుము. తరుణీమణీ! తరువాత తరువాత?

లీలా—తరువాత నన్నుఁ జెఱఁగొనెదనని చెప్పుటతోడనే భయంబంది
మూర్ఛిల్లితిని.తరువాత నేమయినదో నాకుఁదెలియదు. నాకుఁ
దెలివివచ్చునరికి మహారణ్యామధ్యంబున నొకచెట్టునీడనుంటిమి.
మృగరాజుమోలనున్న మృగశాబకంబట్లున్న నన్నుఁగని నదు
వుమని నిర్బంధింపఁ జేయునది లేక, వానింబ్రతిమాలుచు నడువ
నారంభించితిని. నాప్రార్థనలన్నియు వానియెడవ్యర్థంబులయ్యె.

హిర—(కోపముతో ఇంద్రు నుద్దేశించి)

శా. ధైర్యస్థైర్యములేని యంగనలపై । దర్పంబుజూపింపఁగాఁ
గార్యంబేమిర మూర్ఖచిత్త! ననుఁ దాఁ । కన్ నీకుధైర్యంబు, నీ
శౌర్యంబున్ గనఁ తేఁటతెల్లమగురా! । స్వర్గాధిపా! ఇంద్ర! నీ
కౌర్యంబెట్టిదొ నాకుఁజూపుటకు రా । రా! బాలిశా! వేగమే..

కానిమ్ము. నీమదము సదమదముఁ జేసితీరెద. తరువాత, తరువాత?

లీలా—తరువాత నాకుద్భవించెడి యీబాలుండు తనకపకారం బొన
రించుననియు; కనుక నీబాలుని సంహరించిగాని నన్నువిడువ
ననియు, అంతదనుక, నన్నుఁదప్పక బందిగమంచుచుననియు

ఇఁక నెన్నియో నిష్ఠురోక్తులంబల్కి తోడ్కొనిపోవుచుండఁగా, జేయునది లేక స్త్రీస్వభావంబగు దుఃఖంబున బిగ్గఱగా విలపింపంజొచ్చితి. నాయారవంబునువిని త్రిలోకసంచారియు, బ్రహ్మమానసపుత్త్రుఁడును నగు నీ నారదమహామునీంద్రుం డరుదెంచి వానిని మందలించి వానితో నేదియో మంతనముసల్పి వాని చెడుభావంబును మాన్పించి వానిం బంపించి నన్ను రక్షించె.

హిర—(సంతోషంబుతో) నారదమునివర్యా! మీరొనర్చిన యుపకారము కడుంగడు శ్లాఘాపాత్రముజుడీ! మీబంధుప్రేమ కేనెంతయు సంతసించితిని. మునీంద్రా! ఇందునితో మీరొనర్చిన మంతనం బేమి?

నార—(తనలో) ఇప్పు డీతనితో నున్నదున్నట్లు చెప్పితినేని నాప్రాణంబుల కీదినంబుననే భరతవాక్యము జెప్పికొనవలసివచ్చును. ఏమిచేయుదును? (ఆలోచించి) సరియే. ఇట్లొనర్చెదఁగాక. (ప్రకాశముగా) దానవనాయకా! ఏవిధముగానైనను నీదేవి యగు లీలావతిని రక్షించెడితలంపున వానిదరిఁజేరి-మహేంద్రా! హిరణ్యకశిపుం డనన్యసామాన్యుండనుకొంటివేమో? అతఁ డిప్పుడు మందరాద్రిపై దపమాచరించుచున్న యంశం బీవెఱింగినదే కదా? అతఁడు చతురాననునివలన దుర్లభంబులగు వరంబులంగ్రహియించి కొలఁదికాలంబులోనే రానైయున్నవాఁడు. అతఁడు వచ్చెనేని నీకును, నాకును, తక్కుంగల దేవతలకును, నిలువనీడ యుండదు. ఏల యిట్టి తెలివిమాలిన పనియొనర్చితివి? ఇప్పటికైనం బుద్ధి దెచ్చుకొని యీలీలావతి నిటడించి పొమ్మంటిని. అతఁడును నావాక్యంబులయందలి దృఢవిశ్వాసంబున నీమె నట డించి పోయెను.

హిర—మావంశంబునకును, నాకును, మిగుల ఖ్యాతివచ్చుపటులను,

పాకశాసనునకు బుద్ధివచ్చునటులను సముచితంబుగా వానికిఁజెప్పి నాయర్ధాంగలక్ష్మిని నాకొసంగిన మీకరుణావిశేషంబున కేనెంతయుఁ బాత్రుండను. ప్రియా! తదనంతరం బేమిజరిగె ?

లీలా—ఉలూకుండరిగిన కొంతసేపునకు ధైర్యముందెచ్చుకొని, మునీంద్రా! నన్ను నాసదనంబునకుం జేర్చి, నాకొలఁది మర్యాదం గ్రహించి నన్నానందింపఁ జేయుడని యనేకవిధంబుల బ్రతిమాలితి. అంత నిమ్మునివరుం డట్లు గాక, నీవు తిరిగి పట్టణంబునకు వచ్చువఱకును దనయాశ్రమంబుననే యుండుమని యానతీయ వానిమాట కెదురాడనోపక యట్లే వాని యాశ్రమంబున నుంటిని.

హిర—నారదా! నీయాశ్రమమం దీమె నుంచుటలో నీయుద్దేశం బేమి?

నార—ఒకానొకవేళ మరల నింద్రుండరుదెంచి యీమెను దోడ్కొనిపోవునేమో యనుభయంబున నట్లొనరించితిని. నాయాశ్రమంబుననేయున్న యెడల మాకోటిమునులకు భయపడి యట్లొనర్చుటకు వెనుదీయును గావున నట్లొనర్చితిని.

హిర—బాగు నారదా! నీవు దేవతాపక్షపాతివైనను మాకు బంధుకోటిలోనివాఁడవగుటచే నాకు వందనీయుఁడవుసుమా? దేవీ! తరువాత తరువాత ?

లీలా—మనోనాయకా! నేను నీవిరహానలంబున నుద్భవిల్లెడిదుఃఖంబుచే మడియుదునను భయంబున నమ్మహానుభావుండు తన జపతపంబులయందైననునశ్రద్ధవహించి, నావిచారంబు వాపుటకై శ్రవణానందంబులగు ననేకేతిహాసంబులం జెప్పుచుండెడిని. ఇట్లు కొలఁదికాలంబు గడచినపిమ్మట నొక శుభదినంబున నీబిడ్డండు జన్మించె. బాలకునింజూచి సమస్తవిచారంబులం బాపి నిశ్చిం

తతోఁ గాలము హాయిగా వెళ్ళఁబుచ్చితి. తరువాత నీవువచ్చి నయుదంతం బెఱింగి నన్నుఁ దోడ్కొనివచ్చె.

హి—దేవీ! ఇఁక విచారింపకుము. నేను తపంబునకరిగి వాణీనాథుని మెప్పించి వానివలన—

లీలా—నాథా! తమకు నలుమోముల వేల్పొసంగిన వరంబులన్నియు నారదముని నాకెఱింగించె.

హిర—అట్లనా? ఆవరంబులసహాయ్యంబునను, నాభుజబలంబువలనను, నీశత్రుసంతతినంతయుఁ బరిమార్చెద. తరుణీమణీ! ఇదే నాప్రతిజ్ఞ వినుము.

సీ. నిష్కారణంబుగా । నిన్ను బాధించిన
వజ్రపాణిని బల్మిఁ । బట్టువాఁడఁ
బట్టి యాతని ప్రియ । భార్యచేఁ దప్పక
నీసేవ లొనరింప । నిర్ణయింతు
వానికిఁ దోడ్పడ్డ । వారలఁ జెఱపట్టి
చేయింతు నాసేవ । శీఘ్రగతిని
యాశైనఁ గ్రోడమై । యనుజునిఁ జంపిన
చక్రపాణినిఁ బట్టి । సంహరింప

తే. గీ. విష్ణులోకంబునకుఁ బోయి । వేగ వాని
రూపుమాపెదఁ దప్పక । రూపవంతి!
యన్న యట్టుల నేఁ జేయ । కున్న నన్ను
హేమకశిపుఁడంచును బిల్వ । కింతి నీవు.

విప్ర—దేవా! తప్పొనర్చినవాఁడు దండింపంబడక పోవడుగదా? తమ రాగ్రహమునుండి విముక్తులు గావలయునని వేడుచున్నాను.

హిర—మంత్రీ! విప్రజిత్తీ! నీమాటనిజము. అలుక నొందులకు? అద్దురాత్ముని దండించుటకుఁగాను మనము రేపుదయమే తప్పక

బయనముగావలయును. అందులకుఁదగిన ప్రయాణసన్నాహము జేయుము. నీవు నా వెంటవచ్చుటకు సంసిద్ధుఁడవై యుండుము. శంబరకుమారుఁ డిచ్చ్యోడనే రాజ్యపాలనం బొనరించుచుండ వలయును.

విప్ర— దేవర యాజ్ఞాప్రకారంబు సల్పెదము.

నార— దానవనాయకా! యుష్మదాజ్ఞయను భద్రంబుగా నీకొసంగితిని. నాపైనున్న బరువు తగ్గె. కాఁబట్టి నాకనుజ్ఞ నొసంగెదవేని నే వెడలెద.

లీలా— నాథా! నాదియొక్క చిన్ని విజ్ఞాపన.

హిర— ఆవిజ్ఞాపనమును వినఁ గుతూహలుఁడనై యున్నాను.

లీలా— నాథా! మనకు మహోపకారం బొనరించిన నిమ్మౌనిసమక్షంబుననే మనవంశోద్ధారకునకు నామకరణమహోత్సవంబు నెరపుట సముచితంబని యూహించెద.

హిర— దేవీ! చక్కనియాలోచనముం జెప్పితివి. మునీంద్రా! మీ ప్రమోలనే కుమారునకు నామకరణంబుం చెద. వాని నాశీర్వదించి పొందు. (అని యాలోచించి)

తే. గీ. అతులమౌ దుఃఖతోయధి । నణఁగియున్న
నాకుఁ బ్రహ్లదమున్ గూర్చి । నాఁడుఁ గాన
నేఁటినుండియు వీనిని । నిఖిలజనులు
బేర్మిఁ బ్రహ్లాదుఁ డనుపేరఁ । బిలువవలయు.

నార— దానవనాయకా! సంతసించితిని. ప్రహ్లాదా! దీర్ఘాయుష్మంతుఁడవై ఘనయశోవిఖ్యాతిం బడయుము. రాక్షసనాయకా! నాకు సెలవొసంగుము.

లీలా— మునించంద్రా! నమస్కారము.

నార— కళ్యాణసిద్ధిరస్తు.

హీర—మునివర్యా! పోయిరండు. (నారదుఁడు నిష్క్రమించును.)

లీలా—మనోహరా! కోపింపకుందు రేని వెండియు నాదొకచిన్న కోరిక-

హీర—మనోహారిణీ! నీకోరికలఁదీర్చుటకు సంసిద్ధుఁడై నీవల్లభుండుండ నడుగుటకు సంశయంబేల? మత్ప్రాణసమానురాలవగు నీవు కోరినఁ గోపించెదనా? నీకోర్కె వినిపింపుము.

లీలా—ప్రాణేశ్వరా! మీయెడఁ గలచనువు పెంపునఁ గోరుదమని యాసజనించుచున్నను, నాకోర్కె విని యాగ్రహాయత్త చిత్తు లయ్యెదరేమో యని భయపడుచున్నాను.

హీర—(తలపంకించుచు నిదానించిచూచి) తరుణీమణీ! ఒకానొకవేళ నీవనినయట్లు నాకాగ్రహంబుజనియించెడికోర్కెయే యైనచో కోరకుండుటయే యుత్తమంబని తలంచెద.

లీలా—(ముకుళితవదనయై కాన్పించును.)

హీర—(లీలావతీమస్తకముపైఁ జేయివైచి మెల్లఁగా నెత్తుచు)

తే. గీ. జలధరచ్ఛన్నపూర్ణిమా । చంద్రునట్లు
నిష్ఫలీకృతవాంఛవి । నీతవేద
నాంచితంబయి, కళఁ దక్కె । నట్టి నీదు
వదనమును జూడఁగలుగదే । వంత నాకు.

కావున నీకోర్కె యెద్దియైననుం దీర్చెద కోరుము.

లీలా—(ప్రసన్నవదనయయి) మనోహరా! వేఱొండెద్దియు లేదు. మీరు మీశత్రుభంజన మొనరింపవచ్చును. కాని శచీదేవిని మాత్రము బాధింపకుందురుగాక యని ప్రార్థింపుచున్నదానను. అమెనిటకుఁదోడ్కొనిరాకుందురుగాకయనికోరుచున్నదానను

హీర—(నవ్వుచు అట్లనే కావించెద. మంత్రీ! విప్రజిత్తీ నేఁ జెప్పిన యటుల రేపకడ ప్రయాణమునకై సంసిద్ధంబుగా నుండుము. నీ వికఁ బొమ్ము.

విప్ర—చిత్తము (నిష్క్రమించుచున్నాఁడు.)

హిర—దేవీ! మనముగూడ లోనికిం బోయి నాతల్లికిబిడ్డంజూపుదము రమ్ము. కుమారా! పోవుదము రమ్ము.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

తే. గీ. ధరణి నేలేశ్వరపువంశ । వరయశుఁడయి
చెలఁగు సుబ్రహ్మణ్యుని ప్రియ । శిష్యుఁడైన
యలఘుసుకవి సోమేశ్వరా । హ్వయునిచేత
వ్రాయఁబడె నిది భూమిపై । వరలుగాత.

శ్రీ

ప్రహ్లాద

తృతీయాంకము—ప్రథమరంగము.

స్థలము—స్వర్గము.

[మహేంద్రుఁడు, బృహస్పతి, యుచితాసనములపైఁ బ్రవేశించుచున్నారు.]

ఇంద్ర—ఆచార్యోత్తమా!

శా. వైకుంఠంబున కేగి చిత్రరథుఁడా । వైకుంఠునిన్ జూచి, నా
యాకష్టంబులు విన్నవింప విని యా । హ్లాద్యత్కృపాళుండు, మ
చ్ఛోకాగ్నిం దగ నార్ప నియ్యెడకొఁగిన్ । సాంత్వించునో లేక దా
రాకన్మానునో యేమిటోఁ చదకటా! ప్రాప్తం బదెట్లున్నదో?

బృహ—మహేంద్రా! ఊరక తత్తరపడిన నేమిప్రయోజనము. వైకుంఠంబున కరిగి, వైకుంఠుని దర్శించి యాతనిపక్షంబున దేవదానవుల వైరకారణంబును, దివౌకసులయార్తియు, దానవుల దౌర్జన్యమును, యుష్మత్సందేశంబును, సమగ్రముగా విన్నవించి యాతఁ డనుగ్రహించినవరంబుల న్వాని రావలయును గదా? నీవింత తత్తరమందనేల ? దయామయుండగు నయ్యా

సంతుఁడు భక్తజనసులభుఁడు గాన యీత్రివిష్టపమును గావక పోఁడు.

ఇంద్రు—గురూత్తమా! అనన్యసామాన్యదుర్లభంబగు నయ్యనంతుని కృపారశ్మి మనపై బ్రసరించునో లేదో గదా? ఆక్రూరరాక్షసుండే వేళవచ్చునో? యే మేమిబాధలం బెట్టునో? యనుభయంబును, నాసందేశమాలించి రమామనోహరుం డేమియనుగ్రహించెనో వినుటకై యుత్సాహంబును నామనంబునం దాండవమాడుచున్నయవి. ఆక్రూరరాక్షసుండు రాకమున్నె యీవిష్ణుసందేశము న్వినుట కెంత యునామనంబు తత్తరపడుచున్నయది.

బృహ—మహేంద్రా! తొలుత నేఁజెప్పలేదా? మృగరాజున కలుకఁ బుట్టించి, వడివడి ప్రాణంబుల నక్కించుకొన నెంచి మృగశాబకమెంతపరుగిడినను దానిబారిఁబడక ప్రాణంబుల నక్కించుకొనఁజాలునే? ఆకొన్నసింగంబున కాయరణ్యంబుననాహారంబునకనువగు మృగంబుకేమియుందొరకక గొంధంబున గుహలోఁ బన్నుండియున్న దానికడకేగి పరిహసించిన లేఁడిగతియేమగును? దాని నెవ్వరు రక్షింపఁజాలెదరు? పరిహసించిన దానికిం దగిన ప్రతిఫల మందవలయునేగాని మఱియొండుమార్గమేమియుఁగానరాదుగదా? దిక్పాలకులందఱు నీపక్షమూనియుంటచే నావాక్యంబులఁ బాటించితివికావు. ఏయంశంబునను నావాక్యంబున కెదురాడ మనంబుననిష్టములేని నీ వీయంశంబునఁ బెడత్రోవం దొక్కితివి. స్వయంకృతాపరాధఫలంబనుభవింపక తీరదుగదా?

ఇంద్రు—మహాత్మా! ఈవఱకే విచారసాగరంబున మునింగి దరిఁగానక బరితపించుచున్న నన్ను మఱింత దుఃఖాబ్ధిలో ముంచుట భావ్యమా?

తే. గీ. మూఁడులోకంబులనుగూడ । ముదముతోడ
నేలుచుండెడివాఁడ నే । నిప్పు డొక్క
బక్కరక్కసుఁ జూచి నా । ప్రాణములను
పిడికిటనుబెట్టి దాఁచికో । వలసివచ్చె.

బృహ——మహేంద్రా! ఒక్కబక్కరక్కసుం డననేల? ముల్లోకంబు లల్లలాడించెడి పరాక్రమసంపదఁ గలిగియుండెనే? పరాక్రమంబు నకుందోడు పద్మభవునిమెప్పించి మున్నెవ్వరు బొందియుండని మహావరంబులంగూడఁ బొందియుండెనని నారదునివలన వినియుంటిమే? అట్టివానింగూర్చి వెఱచుట యొకవింత కాదు.

యము——(ప్రవేశించి తనలో) ఆహాహా ! కాలమహిమ !

సీ. సమవర్తి యనుపేరు । సమసిపోయెను నేఁడు
పలలాసికోద్రేక । వహ్నిచేత
యామ్యదిశాధీశుఁ । డను నామ మడుగంటె
పలలాసికోద్రేక । వహ్నిచేత
దిక్పాలబిరుదంబు । దీరిపోయెను నేఁడు
పలలాసికోద్రేక । వహ్నిచేత
నాచేతిపాశంబు । నాశంబు జెందెఁగా
పలలాసికోద్రేక । వహ్నిచేత

తే. గీ. జోలిమాలినపనికి నే । నేలపోతి?
నహిని దరిఁజేరి చెలఁగాట । లాడునట్టి
వారిపదములు గఱచియే । దీరుగాని
మఱలఁ జెలగాటలాడునే । మహిని నరయ.

(ప్రకాశముగా) మహేంద్రా! పురుషోచితంబయిన శౌర్యధైర్యంబులు దుష్టచరిత్రుండగు హిరణ్యకశిపున కర్పించి, పిఱికిపందనై పరుగిడివచ్చిన యంతకుం డిదే యభివందన మాచరించుచున్నాఁడు.

ఇంద్రు—యామ్యదిశాధీశా !—

యము—నముచిసూదనా ! యామ్యదిశాధీశుం డనుబిరుదంబు హేమకశిపున కర్పించితి. ఇఁక నన్నా పేరునం బిల్వకుము.

ఇంద్రు—కృతాంతా ! హిరణ్యకశిపుఁడు నిన్నుఁ బరిభవించెనా ?

యము—దేవా ! ఏమి చెప్పుదును. రాత్రించరుం డరుదెంచి యోరోరి సమవర్తీ ! మత్సహోదరుండగు హిరణ్యాక్షుఁ డెట్టిపాపంబు లొనరించెనురా? ఏదీ! చూచెద. నీవెందయిన లిఖించితివేమో యాతం డొనర్చినపాపంబు లెవ్వియో నాకుఁజూపుము. ఔరా! నన్నెన్నఁ జూడక నేలేనియదనుం గనిపెట్టి మదీయపురప్రవేశ మొనర్చి పాశంబుచే మద్భటాళిప్రాణంబు లపహరించితివఁట. నీ వెంతగుండెలుదీసినబంటువురా ! ఇంకెందుఁ బోయెదవురా ? యని పండ్లు పటపటగొఱుకుచు నాకేశంబులొడిసిపట్టి, నన్నమాంతముగాక్రిందికిలాగి, ఓరోరిదుర్మదా!పిసాళీ! మొక్కళీ! ప్రిక్షిప్తం బెట్టిదియో యెఱుంగని నీవీదిక్పాలపదవి కనర్హుడవు. ఇంతకాలము నీవత్యంతశ్రమతోనుద్యోగంబుఁ గైకొనిన్యాయా న్యాయవివక్షత లేకుండ బరిపాలనం బొనరించినందుల కీచతుర్థార్థచంద్రప్రయోగంబులను హిరణ్యకశిపుం డిచ్చిన కానుకగా గ్రహించిపొమ్మని నన్నతిక్రూరత్వంబున నఖక్షతంబుంగావించె.

ద్వార—(ప్రవేశించి) దేవా! జయము. చిత్రరథుం డరుదెంచినాడు.

ఇంద్రు—సంతోషము. సంతోషము. శీఘ్రప్రవేశ మొనర్పుము.

ద్వార—చిత్తము. (అని నిష్క్రమించును.)

[ప్రవేశము: చిత్రరథుఁడు]

ఇంద్రు—(చిత్రరథునిజూచి) చిత్రరథా !

చ. కనఁబడినాఁడె నీకచట ! కంజదళేక్షణుఁ డైనవిష్ణు ? వా
తనికెడ మాదుకష్టములు ! దైన్యగతి న్వచియించినావె? యా-

మనుపరిబ్రోతునంచుఁ దగ । మన్ననఁ జేసెనె ప్రేమతోడ ? నే
వినుటకు సంతసంబొదవె । వే వచియింపుమి యక్షరంబులోఁ.

యము—(ఆతురతతో) ఈ హరిసందేశం బాలించి యా వైకుంఠేశుం డభయంబిచ్చెనా ? లేదా ?

చిత్ర—దేవా! మీచే ననుజ్ఞాతుండనయి వైకుంఠంబున కరిగి భక్తజన సులభుండగు నప్పద్మనాభుని దర్శించితి. మీ వార్తావహుండనని యెఱింగినవాఁడై నన్నతిగౌరవంబునం గూర్చుండఁబెట్టి దిక్పాలకుల క్షేమంబడిగె. అంత నేను రాక్షసపరాభవంబునకుసిద్ధంబుగానున్న మీ క్షేమంబును, మీ రా దామోదరునికిం జెప్పుమని నుడివినవాక్యంబులును యాతని కెఱింగింపఁ "చిత్రరథా! హిరణ్యాకశిపునకింకను గాలంబు దారసిల్లియుండ లేదు. వాఁడు చతురాననునివలనఁ బెక్కువరంబులం బొందియున్నాఁడు. కావున నే వానిమరణసూచనకై వానిగర్భంబున మద్భక్తాగ్రేసరుండగు బాలుండు జన్మించియున్నవాఁడు. అచిరకాలంబుననే వాని యాయుఃపరిమాణం బంతంబయ్యెడిని. అంతవఱకు శాంతి వహించి దైత్యునిబాధల కోర్చి యెట్లో కాలంబుగడుపుమనుము. నీవిఁకఁబొమ్ము" అనియె. ఇవియే నద్దయాళునివాగార్భటీ శీకరంబులు.

ఇంద్రు—ఆహా! ఎంతకష్టమెంతకష్టము. ఈ క్రూర రాక్షసుం డపారమగు బాధలంబెట్టుచుండ మేమెట్లు సైరింపఁగలము. హా! మాధవా! ఇం కెంతకాల మీరాక్షసునిబాధల భరింపవలయును. సరియే. చిత్రరథా ! నీ విఁకఁ బొమ్ము.

చిత్ర—చిత్తము. (అని నిష్క్రమించి మఱలఁ బ్రవేశించి) దేవా !

సీ. నిడుదలౌ నెట్టని । వెడదకన్నులనుండి
విస్ఫులింగంబులు । వెడలుచుండ

జృంభించి మిక్కిలి । జేవురించినమేన
స్వేదకణంబులు । జిమ్ముచుండ
చిమ్మచీఁకటితోడఁ । జెలిమియొనర్చెడి
నిటలంబునందు భ్రూ । కుటి నటింపఁ
బలుమాఱుఁ దనపండ్లు । బటపటఁ గొఱుకఁగాఁ
దొట్టవా తెఱనెత్తు । రుట్టిపడఁగ

తే. గీ. వసుధనిలువక వడివడిఁ । బరుగులిడుచు
హుమ్మనుధ్వని యొనర్చుచు । హుంకరించి
భూనభోంతరచక్రముల్ । భోరుకలఁగ
నార్చి యటువచ్చుచుండె నా । యసురుఁడెవఁడొ ?

ఇంద్రు—ఆచార్యోత్తమా ! కర్తవ్యము?

బృహ—మహేంద్రా ! కర్తవ్యమున కేమున్నది. మన కెట్లును బరాభవంబు తప్పదు. హిరణ్యకశిపునిప్రతిజ్ఞావాక్యంబులన్నియు నారదుండు మనల కెఱింగించెఁగదా? కాఁబట్టి పౌలోమితనసుతునిందోడ్కొని మేరుపర్వతసమీపంబున నుండుట మంచిది. కావున చిత్రరథునిచేతనే జయంతునిఁదల్లినిఁ బొమ్మని వార్తఁ బంపి మన మాదానవుని వాక్యంబుల కన్నింటికినిఁ దలనూఁచుటయే కర్తవ్యము.

ఇంద్రు—(విచారముతో) చిత్రరథా! నీవరిగి శచీజయంతులతో జరిగినవృత్తాంతంబంతయు సమగ్రంబుగా వినిపించి, కష్టకాలంబు గడచువఱకు, వైకుంఠేశునకు మనయెడ ననుగ్రహంబుగల్గువఱకు, దుష్టరాక్షసుండగు హిరణ్యకశిపుం డంతరించెనని వీనులార వినంబడువఱకు, మేరుపర్వతప్రాంతంబుల మెలఁగవలయు ననుము. కష్టంబు లిల్లుగట్టుకొని కాఁపురం బుండవనుము. మఱియు,

సీ. ఆలుబిడ్డల పొట్ట । కన్నంబు దేలేని
పాకశాసనుఁ డిట్లు । బల్కెననుచు
వెలఁదిరో! స్వర్గంబు । విధిలేక చేఁజేతఁ
బొలసుదిండికి ధార । పోసితనుచు
తలదాఁచుకోఁదగు । స్థలమెన్న మేరుప
ర్వతభూమి మనకు ని । వాసమనుచు
రాక్షసాధముఁ డిందు । రాకుండ వేగమే
నమృతభాండంబుతో । నరుగుమనుచు
తే. గీ. పంచవర్షంబు లచ్చట । బ్రతుకవలయుఁ
బిదప మన కెందు సౌఖ్యంబు । లొదవుననుచు
చెప్పవలసినసంగతుల్ । జెప్పినాఁడఁ
జిత్రరథ! పొమ్ము దాల్మినిఁ । జెలియ కడకు.
చిత్ర—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు)

[తెరలో]

ఓ! సురసిద్ధసాధ్య విద్యాధరకిన్నరకింపురుషులరగు నోయోధవరు లారా!

క. శతమన్యుండఁట ధర్మ
స్థితినెఱిఁగినవాఁడఁట, నల । త్రిభువనములకున్
బతియఁట, తెల్పుఁడి లీలా
వతీమనోహరుఁడు జూడ । వచ్చెనటంచున్.

యము—అయ్యయో! ఆకంఠరవ మాహిరణ్యకశిపునిదే. అక్కటా! వచ్చుచుండెనే?

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు]

బాండుటుర్యాన్-ఆదితాళము.

హిర—ఒంచెదన్ య - డంచెదన్ నినుఁ - దుంచెదన్
యుంచుక పతి-యుంచును, మది-నెంచకనల-యుంచిననిను॥నొం॥

దనుజాలబలమెల్లన్ - గనుఁగొనబలమున్నన్
తనివిదీరఁ - గనఁగనీకు - ధైర్యమున్న వేగరార॥ నొంచె॥

(అని యింద్రుని సింహాసనముపైనుండి క్రిందకులాగి బృహస్పతివైపు దిరిగి) ఓ! దేవగురూ! బృహస్పతీ! తారామనోహరా! పడుచు దనపుగర్వంబునఁ గన్నును మిన్నునుంగానక దురాచారుఁడై వర్తించుచుండిన మహేంద్రుని నీవైన మందలింపవలదా! నల్ల గడ్డము తెల్లఁబడినయట్లే నీబుద్ధియుం దెల్లబడియెనా? ముదిమిచే మదిచెడియున్న నీ వెట్లీమహేంద్రునకు హితోపదేశ మొనర్ప సమర్థుండవగుదువు? (అనియిటునటుఁజూచియాశ్చర్యముతో) ఎవరు వీరు? దిక్పాలకులా! ఏల యిట్లరుదెంచితిరి? మరల నులూకునితోఁగూడి నాపట్టణంబుముట్టడించెదరాయేమి?

బృహ—(వడంకుచు) దానవనాయకా!—త—మ—

హిర—కండ్లుగానవా! దేవతల పీచమడంచితినని యెఱింగియు నన్నేల దేవదానవనాయకా! యని పిలువవు? ఏది యట్లు పిలువుము?

బృహ—దేవదానవనాయకా! తమరీసింహాసనంబుపై నధిష్ఠింపుఁడు.

[ప్రవేశము: విరూపాక్షుఁడు]

హిర—(చూచి) విరూపాక్షా! ఈదేవతలు కాళ్ళబేరంబునకువచ్చిరి. కాన నీయింద్రుని, వీనికి సహాయ్యంబునకువచ్చిన యీయప్రయోజకులైన దిక్పాలురనుగూడఁ దోడ్కొని మత్పురీవరంబునకరిగి యట బందిగములో నుంచుము. నేను తిరిగి పురప్రవేశ మొనర్చినవెనుక వీరల కుద్యోగంబులం గల్పించెద. మఱియు నోవిరూపాక్షా! నేను వైకుంఠంబునకుఁ బోవలయును. విప్రజిత్తితో నన్నుఁగలసికొమ్మని నావాక్యములుగాఁ జెప్పుము.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

విరూ—అయ్యా! నడువుఁడు. (అందఱు నిష్క్రమింతురు)

ద్వితీయరంగము.

స్థలము—వైకుంఠము.

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు, విప్రజిత్తియు, ఖడ్గధారులై]

హిర—విప్రజిత్తీ! అష్టదిక్పాలకులన యనన్యసామాన్యదుర్లభు లను కొంటిని. వారు వట్టిపిటికివారు సుమా? ఔరా! ఆవిధాత యెంతమూర్ఖుఁడు. దిక్పరిపాలకుల ని ట్లసమర్థుల నిర్ణయింపఁ దగునా? ఏమీ వాని మాహాత్మ్యము. ఏమయిన నేమి? మనపని సఫలీకృతమయ్యెను గదా? ఇంక నాయనుజుని యంతంబునకు మూలకారకుఁడైన యాహరిమద మడంపవలయును పైగ్గడా!

శా. నాతో నగ్ని కుబేర మారుతవరుల్ । నాకేశుఁడుఁ మద్గదా
ఘాతానూనదవానలంబునకు స్నిగ్ధ । ప్రాణులైయుంటఁ జే
సేతఁ సర్వము ధారపోసిరి కదుఁ । జింతింప నావిష్ణువే
యీత్రైలోక్యములందు శత్రువుగదా? । యేరీతిఁ జెండాడెదఁ.

కానిమ్ము. విష్ణులోక మిదియేగదా? నే లోనకుం జని వానింబట్టి తెచ్చెద. నీ విందేయుండుము. (అని లోనకుం జని రెండవ వైపునుండి ప్రవేశించి) ఓరోరి కులాంతకా! నీ వేమూలపిటికి పందవై యడఁగితివిరా జడమతీ! నీకుం బ్రబలవిరోధియగు హిరణ్యకశిపుం డిదే నిన్నుఁజూడ—కాదు. కాదు. నిన్నుమడి యింప వచ్చియున్నాఁడు. శక్తిగలదేని వచ్చి నాయెదుట నిలువుమురా! ఓరోరి పిటికిపందా! పూర్వము—

ఆ. వె. మట్టగిడసవయ్యు । మడియించినావఁట
మానుకీనవంశ । సోమకుని, నాగి

నన్నుఁ జంప నీవు । నక్కయో, కుక్కయో
యిష్టమైన రూప । మెత్తి రార !

(తెరమీఁద మత్స్యావతారము గాన్పించును.

ఓహోహో! నన్నును నీచేఁపరూపంబుచేతనే మడియింపన్వచ్చితివా? రమ్ము రమ్ము. నీ తుత్తుళ్ళడంగించెద. (అని దరిఁజేరి పట్టుకొనఁబోవ నదృశ్యమగును) ఏమీ! నీ కీరూపంబుచే స్వాధీనంబు గానని పరుగిడితివా? మఱల నేరూపంబు దాల్చెదవో దాల్చి రమ్ము రమ్ము. హిరణ్యకశిపుండన నీకు సాధ్యుం డనుకొంటివేమో? కాఁడు. కాఁడు. ముమ్మాటికిని గాఁడు.

[తెరమీఁద కూర్మావతారంబు గాన్పించును.]

విప్ర—దేవా! మరల నామేటి తాఁబేటిరూపంబు దాల్చి వచ్చి యున్నాఁడు.

హిర—రానిమ్ము. రానిమ్ము. ఓరోరీమాయావీ !

తే. గీ. తుచ్ఛరూపంబులను దాల్చి । దుష్టబుద్ధి
శత్రునాశన మొనరింప । సాహసమొకొ ?
కులము, బలము, మానంబు, । గలిగెనేని
చేతఁజేయిచ్చి పోరరా । చెనఁటి నీవు.

(అని వడివడిఁ జని పట్టుకొనఁబోవ నంతర్ధానమగును.)

ఏమీ! యీవింత? వీని నిరంతరమైన నివాస మెఱుంగరాకున్నదే ! వీని నెక్కరణిని మడియింతును ?

[ఆలోచించుచుండఁగా వరహావతారంబు గాన్పించును.]

ఓరోరి ! తుచ్ఛా ! నాయనుజుని మడియింపందాల్చిన పందిరూపమిదియేనా? ఒక్కనిమేషం బట్లనే యుండుము. పరలోకంబున నాతమ్మునిఁ గలసికొనుటకు—కాదు. కాదు. శరణువేఁడుకొనుటకై పంపించెద. కాచికొమ్ము.

మత్తకోకిల.

పందిరూపము దాల్చి తమ్ముని । భస్మమొందఁగఁ జేసి ని
స్తంద్రితన్ పరిపంథి! నిన్నిఁక । దద్దఁ జంపఁగ నెంచి నే
నిందువచ్చితి నోమృగాధమ! । యెందుఁబోయెద వింక నీ
వ్రిందఁజేయుదు కాచికొమ్మిఁక । రాగశూన్య విమోహకా !
(అని కోపముతో నడచుచుండ వరహావతార మంతర్ధానమగును.)
(కోపముతో) విప్రజిత్తీ ! నాకు భయంపడి యానిలుకడ లేనిగిగ్గాణి
శలాయనంబయ్యె. ఇట్టి పిఱికిపందను, మాయకానిని, తుచ్ఛుని
జడమతిని, సంహరింపఁ జూచుట నాపౌరుషంబునకే కొఱంత
యయ్యె. నారాక న్విని పరుగిడిన యీ మహాబలశాలి మన
కపకార మొనర్పఁజాలఁడు, కాన బోదమురమ్ము (ఆలోచించి)
వెఱ్ఱిగడా! చండామార్కులవద్ద విద్యాభ్యాసము సల్పుచుండిన
నాతనయుండగు ప్రహ్లాదుని జూచుటకై నామనము తత్తరపడు
చున్నయది. కాన యాలసింపక రమ్ము. పోదము.
విప్ర—చిత్తము. (అని యిర్వురును నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

తే.గీ. ధరణి మేడపాడ్యన్వయ । పరయశుఁడయి
కీర్తిఁగాంచిన నరసింహ । మూర్తి యల్లుఁ
డైన సుకవి సోమేశ్వరా । హ్వాయునిచేత
వ్రాయఁబడె నిది భూమిపై । వరలుగాత.



ప్రహ్లాద.

తురీయాంకము—ప్రథమరంగము.

స్థలకము—హిరణ్యకశిపునిసభ.

[హిరణ్యకశిపుఁడు, లీలావతి, విప్రజిత్తియుఁ బ్రవేశించుచున్నారు.]

హిర—మనోనాయకీ !

కం. ఋణ, రణ, వ్రణ, శేషంబులు
మనుజునకుం దగవటండ్రు । మాత్యులు నిలఁ గా
వునసే నాశత్రువులను
ననుకంప యొకింత లేక । నడఁచితిని జెలీ !

పురంధ్రీరత్నమా ! దుర్మదాంధులై మన కపకృతి సల్పిన యాదిక్పాలుర నడంచితి. అన్యాయంబుగానాయనుజునియసువులందీసిన యమ్మాయకాఁడు నాకు భయంపడి పరుగిడె. అట్టివాఁడు నన్నేమిచేయగలఁడు! (మంత్రివైపుఁ దిరిగి) మంత్రీ !

విత్రి—దేవా! ఏమియాజ్ఞ ?

హిర—అష్టదిక్పాలకుల నడంచితి. నాచేఁ బరాభవంబునకుఁ బాల్పడ వలసివచ్చు ననుభయంబున నేమూలనో డాఁగిన యావిష్ణువు నాకన్నఁ దక్కు-వవాఁడే? కాబట్టి యిటు వినుము. సృజించుట

కొక్కరుండును, లయకారకుఁ డింకొక్కరుండును, యింక నే వేవియో నుద్యోగంబులం గల్పించుకొని పెక్కండ్రిధరామండలంబు పాలించుచుండుటచేత నే యిట్టి యన్యాయంబు పుద్భవిల్లుచున్నయవి. నాభుజపరాక్రమంబున వీరి నందఱిని నిగ్రహించి తదుద్యోగం బేను గైకొంటి. కావున ముల్లోకంబులం గల ప్రజలెల్లరు నన్నే భగవంతునిగా నెంచునట్లు, నన్నే పూజించునట్లుజాటంబంపుము. మునులెల్లరుననన్నుఁగూర్చియే తపం బాచరింపవలయును. ప్రత్యక్షంబయిన నేనేప్రత్యక్షంబై తగినవరంబు లొసంగెదను. ఒకానొక వేళ నేమూర్ఖులైనను నన్నుఁ గొల్వకున్నయెడ వారింబట్టి దడించెదమనియుంగూడఁ జాటింపఁబంపుము. నేఁడే యొకజంఘాలకుం డగుజాంఘికుని నియమించుము. ఇటు వినుము.

సీ. జననవృద్ధిలయాభి । సంరంభరశ్మిచేఁ
దిగ్గుణాత్మకుం డౌచు । దివిరినాఁడు
యామ్యదిశాధీశు । నడుగంట దిగఁద్రొక్కి
బనివడి యముఁ డౌచుఁ । బరఁగినాఁడు
ప్రాగ్దిశాధీశుని । బదహీనుఁగాఁ జేసి
స్వర్గాధిపతి యౌచు । వరలినాఁడు
సుమనఃకలాపంబు । సుక్కింపఁగాఁ జేసి
సుమనఃకలాపుఁ డై । యమరినాఁడు

తే. గీ. యట్టివానికి నెదు రేది । యవనిలోనఁ
గాన నా హేమకశిపుని । మానసమున
దేవదేవుఁ డటంచును । దివిరి మీరు
నమ్మి భజియింపవలెఁ జుండి । నెమ్మనమున.

అని చాటంబంపుము. మంత్రీ! నీవింకఁ బొమ్ము.

విచి—దేవా! చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

హిర—చెలీ !

కం. తనయుల సంభాషణములు
 వినుచుండిన మదికి మిగుల । వేడ్క జనించున్
 జననీజనకుల కిలఁ, గా
 వున పిలిపించవలయు మన । పుత్రకు నిటకున్.

(అని ద్వారము వైపుఁ దిరిగి) ఓరీ! ఎవఁడురా ద్వారమువద్ద.

దుర్ము—(ప్రవేశించి) దేవా! ఏమియాజ్ఞ ?

హిర—ఓరీ! దుర్ముఖుఁడా ! మా యాజ్ఞయని తెల్పి చండామార్కుల వారి సాన్నిధ్యంబున విద్య నభ్యసించుచుండిన చిరంజీవి యగు మనప్రహ్లాదుని దోడ్కొనిరమ్మని చండామార్కులవారితోఁ జెప్పుము.

దుర్ము—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

హిర—సుదతీమణీ!

చ. పితలకు ముక్తిదుంప, కుల । వృద్ధికిఁ గాంతిలుచందమామ, సం
 తతఘనదుఃఖవారినిధి । తారణపుంజతరాభినౌక, శా
 శ్వతబహువృద్ధహస్తగత । భాసురమై తగు నూతకఱ్ఱగా
 సుతుఁ డని చెప్పవచ్చుఁగద । సుందరి!సందియమందకుండఁగాఁ.

లీలా—నాయకా! సత్యము. సత్యము. (తెరవైపుఁజూచి) అల్లదే కుమారుండు గురువర్యునితోఁ బ్రవేశించుచున్నాఁడు.

[ప్రవేశము: ప్రహ్లాదుఁడు, చండామార్కులు.]

ప్రహ్లా—జననీ జనకులారా! నమస్కారము.

హిర—దీర్ఘాయుష్యమస్తు.

లీలా—కుమారా! చిరంజీవివై వర్ధిల్లుము. (అని దగ్గరగాఁ దీయును.)

హిర—గురూత్తమా! ఈయాసనం బధిష్ఠింపుఁడు. చిరంజీవి శ్రీధా భక్తులతోఁ జదువుచుండెనా ?

చండా...చిత్తము (కూర్చుండి తనలో) ఓం నమోహిరణ్యాక్షాయ నమః యనుమని చెప్పినప్పుడే "ఓంనమోనారాయణాయనమః" యనిన ప్రహ్లాదుండు తండ్రియెడ నెట్లు ప్రవర్తించునో గదా?

హిర—(ప్రహ్లాదుని దగ్గరగాఁ దీసికొని) కుమారా !

చ. సదయులు, సత్ప్రవర్తకులు । సజ్జనులౌ గురువర్యులెల్ల నీ
కాదవగు సర్వశాస్త్రముల । నొప్పుగ చెప్పఁగ నేర్చుకొంటివే ?

ప్ర—జనకా !

సదయులు సత్ప్రవర్తకులు । సజ్జనులౌ గురువర్యులెల్ల నా
కాదవగు సర్వశాస్త్రముల । నొప్పుగ చెప్పఁగ నేర్చికొంటిగా.

హిర—(సంతోషముతో) గురుపుత్రా! మత్కుమారుని సకలశాస్త్ర పారంగతునిగాఁ జేసితిరి. సంతసించితి. (ప్రహ్లాదునితో) నాయనా! నీ కుపయుక్తంబగు సర్వశాస్త్రములుఁ గూడ కరతలామలకంబయ్యె ననికదా చెప్పితివి. అట్లయిన నాప్రశ్నకుత్తరంబీయుదే ?

ప్ర—జనకా ! చిత్తము.

హిర—కుమారా! నీవు పఠించిన సర్వశాస్త్రంబులయొక్క. సారం బెట్టిదియో యెఱింగితివేని వినిపింపుము?

లీలా—మనోహరా! పంచవర్షంబుల బాలకు నిట్లు ప్రశ్నింపవచ్చునా? మహామహోపాధ్యాయులైన నిట్టిప్రశ్నకు సముత్తరంబిడ సంశయింతురే? అట్టియెడ నిట్టి చిఱుపాపఁడుత్తరం బీయఁగల్లునా?

ప్ర—జననీజనకులారా! యిటు వినుండు.

క. సారం బేమని యనుచుర్
వేరుగ నడుగంగ నేల? । విను దెల్పెద, ని

స్సారము సంసారము శ్రీ

స్ఫారు మదిని గొల్చు టొకటె (సారము జనకా!

హిర—(తనలో) ఏమిది? వీనికి విరోధిమార్గం బెవ్వ రుపదేశించియుం దురు? (ఆలోచించి) భార్గవకులదీపకులగు చండామార్కు లిట్టికుమార్గం బుపదేశించియుందురా? ఏమియుఁ దెలియని చిఱుపాపఁడౌటచే నిట్లనియుండునా? (ప్రకాశముగా) కుమారా! నీవు నుడివిన విష్ణువు మన కులంబులకుఁ బ్రబల విరోధి. నీపినతండ్రిని జంపినాడు. అట్టివానిని మనము గొల్వరాదు. నాయనా! నామాట వినుము.

ప్ర—జనకా! ఏమంటిరి? ఆదిమధ్యాంతరహితుండగు నమ్మహానుభావునకు విరోధులనియు, విహితులనియు లేరు. అందఱు సమానంబులే. దుష్టశిక్షణయు, శిష్టరక్షణయు, నాతని కర్తవ్యంబులు. ఎవ్వని నేరీతి నడియింపవలెనో యాయారూపంబులం దాల్చి దుష్టులను మడియించుచుండును.

హిర—అట్లనా? (తలపంకించుచు) దుష్టు లనువా రెవ్వరు?

ప్ర—తండ్రీ! ప్రపంచమున కపకారంబు సల్పెడివారలందఱును దుష్టులే.

హిర—కుమారా! నావాక్యంబు లాలించుము. పిఱికిపందయగు నమ్మాయాకారుని భగవంతుఁడని నమ్మకుము. (కోపముతో చండామార్కులనుద్దేశించి) గురుపుత్రా! మత్కుమారున కీ విరోధిశాస్త్రంబు లెట్లలవడినవి? ఎంచిచూడనీవె యిట్టిదుర్బోధ కుపక్రమించితివని తలంచెద. లేకున్న వానికీవిరోధిశాస్త్రంబు లెట్లలవడియుండును? (చండామార్కులు వడంకుదురు)

ప్ర—జనకా! నిష్కారణ మామహానుభావుని నిందింపకుము. జగదీశ్వరుండగు నమ్మహావిష్ణువుపై భక్తి యొకటి యుపదేశించి

నంతమాత్రమున నలవడదు. నిజమయిన విష్ణుభక్తుండగుటకుం బూర్వజన్మసుకృతం బుండవలయును. అట్టి పూర్వజన్మసుకృతమే లేనియెడల నెంతయుం దెన్నెన్నిమార్గంబుల బోధించినను వ్యర్థమేగాని లాభం బిసుమంతయుం గానరాదు.

హిర—ఛీ! ఛీ! నాకడమాత్రి మానిష్ణువు "నాదిదేవుం డాదిదేవుం" డని నుతింపకుము. మూర్ఖుండా ! విష్ణువు విష్ణువనుచు వాపో యెదవేలరా దుర్మతీ! విష్ణుభక్తి మానెదవా లేదా ?

ఉ. మానుర విష్ణుభక్తి

ప్ర— అది ! మానను

హిర— మాన నటంచుం బల్క నీ

ప్రాణము దీయువాండ

ప్ర— క్షణ ! భంగురమేగద

లీలా— తండ్రివాక్యముల్

వీనులం బెట్టు పుత్రి !

ప్ర— నను ! వేండకు మమ్మరో !

లీలా— నాథ ! కోపమున్

బూనకుమయ్య !

హిర—యేమనెదు ! పుత్రిక !

ప్ర— వీడంగంజాలం బూనికన్.

హిర—(క్రోధముతో) గురుపుత్రా ! వీనిం దోడ్కొనిపోయి రాజకుమారుండని యాలోచింపక కఠినశిక్షలం బెట్టియయినను వీని నీమార్గంబునుండి త్రిప్పుండు. తోడ్కొని పొండు.

చండా—చిత్తము. (ప్రహ్లాదునితో నిష్క్రమించుచును.)

హిర—ప్రియసఖీ! మనముగూడం బోదమురమ్ము (నిష్క్రమింతురు.)

ద్వితీయరంగము.

స్థలము—పాఠశాల.

[చండామార్కులు ప్రహ్లాదుఁడు, నలుగురుపిల్లలుఁ బ్రవేశించుచున్నారు]

చండా—ఒరేయి! మీరు అల్లరిచేయక పాఠములు చదువుచుండుఁడు. ఇప్పుడే వచ్చెదను. (అని నిష్క్రమించును.)

1వ. బా—ఒరేయి పంతులుపోయాఁడురండిరా కోతికొమ్మచ్చియాడుదాము.

3వ. బా—ఆ యాట వద్దురా—ప్రహ్లాదుఁడేయాటయాడుదామంటే యాయాట యాడుకొందాము.

అందఱు—అడుగుదాము. అడుగుదాము.

2వ. బా—ప్రహ్లాదా! మన మేయాటయాడుకొందాము.

ప్ర—సహాధ్యాయులారా! మన మాటలవలనఁ గాలక్షేపము సేయంజనదు. నేనొక్కయంశం బుపదేశించెద నదివినియెదరా?

అందఱు—ఓ! తప్పకుండా వింటాము చెప్పును. చెప్పును.

ప్ర—మిత్రులారా! సమస్త జన్మంబులయందును మనుష్యజన్మంబు దొరకుట కడుంగడు దుర్లభంబు. అదృష్టవశంబున మనుష్య జన్మంబులభించినను, పురుషుండై జన్మించు టతిదుర్ఘటము. అది యైనను శతవత్సరప్రాయమే! ఆశతవత్సరంబులలో నిద్రా వ్యవహారంబులు పంచాదశవత్సరంబులు గడచు బాల్య యౌవన, వృద్ధ, కౌమారాది విశేషంబులు యిరువదివత్సరం బులు గడచు. మిగిలిన ముప్పదివత్సరంబులును యింద్రియము లచేతఁ బట్టువడి కామ క్రోధ లోభ మోహ మద మాత్స ర్యంబు లనుపాశంబులం దవిలి వానినుండి తప్పించుకొనలేక సర్వము నాదియని 'నా' యను నక్షరంబుతో జగత్తంతయు

నిండియున్నట్లు, తలంచి, పొంగి పర ధన కనక వస్తు వాహన సుందరులం గైకొనం జూచుచు, కాలంబు వ్యర్థంబుగాఁ గడపుటవలన లాభంబు లేదు. ఏదిపోయినను తిరిగిరానచ్చును గాని కాలముమాత్రి మట్లుగాదు. మఱియు, నైజసాహంకారంబువలన జ్ఞానేంద్రియకర్మేంద్రియములుగలై. ప్రాణంబునకుఁ గ్రియాశక్తియు,బుద్ధికి జ్ఞానశక్తియు,భగవంతుఁడనుగ్రహించె. అట్టిశక్తి భగవంతుఁ డనుగ్రహించినందులకు—

చ. తిరమగు నిష్ఠ బూని, కడు । దీక్షితులై భువినెల్లకాల మా
హరి మధుసూదనున్ విమలు । నచ్యుతు సర్వశరణ్యు నిందిరా
వరుఁ గరుణాలవాలు భవ । బంధవిమోచనుఁ బాపనాశునిం
బరుఁ బరమేశుఁ గేశవుని । భక్తిభజింపుచు ముక్తినొందుడీ.

3వ—ప్రహ్లాదా! కేశవునిఁగొల్వుమనుచుంటివిగదా? ఆతఁడెట్టివాఁడు.
1వ బా—ఒడలినిండా వెండ్రుకలున్నవాఁడురా? హరిలాంటివాఁడు.
ప్ర—హితులారా! ఇటు వినుండు. ఆతఁడు భక్తజనసులభుఁడు కేశవా యను నామంబున క, ఈశ, వ, యను నక్షరంబులున్నయవి. అందు క'క' అనగా మనస్సు. సర్వకార్యంబులకును మనస్సే ప్రధానము. అట్టి మనస్సునకు 'ఈ' ప్రభువు అనఁగా మనోనిగ్రహము. (అంతరాత్మ) అట్టిమనోనిగ్రహత గలవారికి 'వ' ప్రాప్యుఁడు. మనోనిగ్రహత గలవారికి లభించెడివాఁడు గావుననే క, ఈశ, వ, కేశవా! యనునామంబామహానుభావునకుఁ జెల్లుచున్నయది. మఱియు,

సీ. అఖిలపాపంబుల । హరియించువాఁ డౌట
హరి యను నామంబు । నతని కలరెఁ
గన స్వరూపంబు నా । శనము లేకుంటచే
నచ్యుతుం డనునామ । మతని కలరె

నింది్రియంబులకెల్ల । నినుఁ జేటచే హృషీ
కేశుఁ డనుచు వానిఁ । గీర్తిసేతు
రఖిలభూతంబుల । యందుఁ బెన్వాలుఁగుచే
వ్యాపించియుండుటన్ । వాసుదేవుఁ

తే. గీ. డరయ భక్తుల దుఃఖమ్ము । లడఁగఁద్రొక్కి
కరుణఁ బాలించుచుంట సం । కర్షణుండు
పురుషులందునఁ గడు నుత్త । ముండు గాన
హరియె పురుషోత్తముం డనఁ । బరఁగు జగతి.

2వ బా—ప్రహ్లాదా! సంతత మావిష్ణువునిఁ గొల్చునంతమాత్రమున వానినిం దెలిసికొనఁగలుగుదుమా ?

ప్ర—ఇటు వినుఁడు. ఉపనిషద్వాక్యంబు లాపరమేశ్వరుని స్వరూపంబునే చాటుచున్నయవి. కావున 'గోవిందా' యను వాక్యంబుచే మన మావిష్ణువునిం దెలిసికొనంగలము. కాఁబట్టి మన మందరము గోవిందభజనము సేయుదమురండు. (ప్రహ్లాదుఁడు చెప్పఁగా మిగిలినవారు పాడుచు వలయాకారముగాఁ దిరుగుదురు.)

2. బా—ప్రహ్లాదా! ఆఁగుమాఁగుము. ఈగోవిందుఁడెచ్చటనుండును?

ప్ర—ఒక స్థానంబన్న నిర్ణయములేదు. చరాచర సమస్తభూతంబుల యందును గూడ నుండును. కావుననే విష్ణువను నామంబునఁ జెలఁగుచుండె. కాఁబట్టి మన మావిష్ణువుని భజింతము రండు. (బాలకు లందఱు గుమిగూడి ప్రహ్లాదుఁడు చెప్పుచుండఁగాఁ బాడుదురు. ముక్తాయింపుతో తన్మయత్వము జెందునట్లుగా భజన సేయుచుండఁగా చండామార్కుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

చంటా—(నిర్ఘాంతపడి చూచి) కొంప ముంచావురా నాయనా! వీరి నందఱిని నీమార్గంబునకుఁ ద్రిప్పికొంటివా? (అని బాలకులతో) ఒరేయి, కుఱ్ఱవాళ్ళు! మిమ్మందఱిని దన్నవలయునా? హరిభక్తిమాని యిటు వచ్చెదరా? రారా?

(పిల్లలు వినిపించుకొనక భజన చేయుచుందురు)

(ఒకపిల్లవానిని లాగ వాఁడు విదళించుకొనును. పిల్లలను గొట్టుటభినయించును.)

1వ బా—ఏమండోయి! ఈదినము లగాయితు మేము మీ శిష్యులము గాము. మమ్ము కొట్టకండి బాగా జరుగదు.

బాలు—(గురువుని పరిహసింతురు.)

ప్ర—(హరిభజనముచేఁ దన్మయత్వముఁ జెందును.)

చండా—(ప్రహ్లాదునిఁ బట్టుకొని యాపఁబోవును.)

1వ—ఏమండోయి! బాగా జరగదు. ప్రహ్లాదుని యుద్యమము మాత్రము మాన్పుటకుఁ బ్రియత్నింపకండి.

చండా—ప్రహ్లాదుని నిలువంబెట్టి) ప్రహ్లాదా! నీ జనకునియాజ్ఞ మఱచితివా? హరిభక్తి నీవు మానుట యటుంచుము. వీరి నందఱిని విష్ణుభక్తులగా నొనరించితివే? రమ్ము. నీ తండ్రియొద్దకు. అక్కడ నీకు బుద్ధి చెప్పించెదను.

ప్ర—గురువరా! చ. తిరమగు నిష్ఠబూని—

(అను పద్యమును జదువుచున్నాడు.)

చండా—చాలు. చాలు. నీయుపదేశంబులు నావద్దఁ బనిసేయవు. రమ్ము. రమ్ము. నిన్ను శిక్షించియైనను త్రివర్గం బుపదేశించెదం బోదము రా!

(నిష్క్రమింతురు.)

తృతీయరంగము.

స్థలము:—లీలావతీ యంతఃపురము.

[ప్రహ్లాదునితో లీలావతి విచారగ్రస్తయై ప్రవేశించును.]

లీలా—(విచారముతోఁ బ్రహ్లాదునిం బ్రతిమాలుచు)

ఋతువల్లరి వృత్తము.

హా!సుకుమారా!/హా!గుణధీరా!/హా!నయధుర్యా!/హా! వరపుత్రా
నీ పరివారల్ / నీజనకుండున్ / నీదు గురుండున్! నెమ్మనివిష్ణున్
బాసిచరింపన్/భాగ్యమటంచున్ / బల్కినదానిన్/బాయవదేలా?
వేసరిచెప్పన్/వీడవుకృష్ణున్ / వేడ్కజనింపన్ / వేఁడవెతండ్రిన్.

తనయా ! సుగుణవినయా ! నా వాక్యంబు లాలించుమా ! నన్నుద్ధరింపుమా! నా యీ దరిలేని దుఃఖసాగరమును దొలఁగఁ జేయుమా ! నీ పితృవాక్యంబు లాలించుమా ! విష్ణుభక్తిం బరిత్యజించుమా? గురువాక్యంబుల న్ద్రోయకుమా ! నన్నుఁ గరుణింపుమా !

ప్ర—అమ్మా! తల్లిదండ్రులును, పుత్రమిత్రాదులును, ధనకనక వస్తువాహనంబులును బుద్బుదప్రాయంబులని యెఱింగియు నీకీ పామరత్వం బేల? కేవల బుద్బుదప్రాయంబగు నీ దేహముం గూర్చి భ్రమచెంది చెంది దరిలేని మోహంబునఁ దలిపి తవిలి—

సీ. సంసారవిపులాగ్ని / శలభసంగతి గల్గి
యస్థిరకాయమం / చరయలేక
కామాంధులై తమ / గతిఁ గానఁగాలేక
మదమోహమాత్సర్య / మమత పెరుఁగఁ
దారా సుతార్థ సం / తతమోహశల్యులై
యజ్ఞానతిమిరంబు / నందుఁబడుచు

కాలమంతయు వృథా । గడపి యత్యంతంబు
భవరోగ సంబంధ । బంధులగుచు

తే. గీ. యంత్యకాలంబు నందున । యముని చేతఁ
కుటిలబాధలఁ బడుచును । గుందికుంది
మఱలఁ బుట్టుచుఁ జచ్చుచు । మనుటకంటెఁ
బరునిఁ బ్రార్థించి ముక్తినిఁ । బడయమేలు.

జననీ! అట్టి సంసారకూపంబునందు నన్నేలఁ ద్రోచెదవు. నన్నుం గరుణింపుమా! నామానసము గలంపకుమా?

లీలా—నాయనా! నీ తండ్రి యీ విషయమయి మిక్కిలి పట్టుదల వహించియున్నవాఁడు. నీవు సకల శాస్త్రార్థపారంగతుఁడవై పరిణమింపుచు బంధుమిత్ర సుతసతీ సంతతులతోడను, ధన కనక వస్తుసమూహంబులతోడను విరాజిల్లుచుండఁగాఁ గాంచి యానందింపఁదలంచిన నన్నింతగాఁ జిన్నపుచ్చ భావ్యమా?

ప్ర—అమ్మా! జననీ! నీ వెంత వెఱ్ఱిదానవమ్మా! నీ వుపన్యసించిన వన్నియు నిశ్చలదాయకంబులగు సౌఖ్యంబులనియే యెంచితివా? ఇట్టి తుచ్ఛసౌఖ్యంబులన్నియు మీసాలపైఁ బూసిన తేనెచుక్కలు.

సీ. కాంతగాదది ముక్తి । కాంతను మనదరి
జేరకుండఁగఁ జేయు । మారిగాని
బాంధవుల్ గారమ్మ! । పరమేశు నెడఁబాపి
నరకంబుఁజూపు కిం । కరులు గాని
హితులుగా రమ్మ! శా । శ్వతు నంటఁజేయని
వికటజ్ఞులైన పా । తకులు గాని
ధనముగా దది మన । మనములు నెఱ ముక్తి
దహియించునట్టి యిం । ధనముగాని

తే. గీ. పుత్త్రులంచును మదిలోనఁ । బొంగ నేల?
ధరణి దుఃఖాబ్ధి ముంచు శాత్త్రవులు గాని
తుచ్ఛసుఖముల నన్నింటిఁ । ద్రోలఁగఁజేసి
మాయసంసారమును వీడి । మనుట మేలు.

లీలా—నాయనా! మన కులంబున కెల్లఁ బరమశాత్త్రవుండగు విష్ణువునిఁ గీర్తించుచుంటివని నీ తండ్రి యీావటికే యాగ్రహాయత్తచిత్తుండై యున్నవాఁడు. తండ్రీ! నా వాక్యంబు లాలించుము.

ద్వి ప ద.

లీలా—మానుర హరిభక్తి । మాను నాతండ్రి!
పూనకు తండ్రితో । పుత్త్ర! వైరంబు.
ప్ర—మానుట హరిభక్తి । మఱి కల్లసుమ్మి
పూనిన వైరంబు । పోనిమ్ము జనని.
లీలా—తగునయ్య! వైరంబు । తండ్రితో నీకు
పగవారిపై భక్తి । బాయక నిల్పి.
ప్ర—ఇమ్మైన హరినామ । మెంతటి రుచియొ
యమ్మరో! తెలిసిన । యటు లాడఁగలవె?
లీలా—బ్రతిమాల నీకింత । పంత మదేల?
గతి నీవె యను నన్నుఁ । గరుణింపరావె.
ప్ర—పగవాఁడు నన కుండఁ । బ్రార్థించుమమ్మ!
ఖగవాహనుఁడె నిన్నుఁ । గరుణించునమ్మ.
లీలా—జనకుఁడు యిది విన్నఁ । జాల కోపించుఁ
గనఁజాల నే నది । గాన మానుమురా.
ప్ర—పలు పలుకులు నేలఁ । బ్రణుతిఁ గావింతు
జలజాతనేత్రుని । స్మరియింప మాన.

లీలా—నా కర్మగతి యిట్లు । నన్నలయింప
నాకూన వినుకెట్లు । నాదువాక్యములు.

ప్ర—అమ్మా!

ఉ. కన్నకుమారు విన్నపముఁ । గైకొని లాలనఁ జేయుమమ్మ! నీ
చిన్ని నిసుంగుమానసము । శ్రీపతినుండియుఁ ద్రిప్పకమ్మ! నేఁ
గ్రిన్నన మ్రొక్కువాఁడ నను । గాదిలి పేర్మిను జూడుమమ్మ! యా
పన్నశరణ్యుఁ గొల్చి భవ । బాధములన్నియుఁ ద్రెంపుమమ్మరో!

లీలా—కుమారా! మనకులారణ్యంబున కియ్యెడ దావాగ్ని యుదయించుచున్నట్లున్నది. లేకున్న నీవింత పట్టుపట్టియుండవు. నీవు విష్ణుభక్తి మానవని భీష్మించుకొని యున్నాఁడవు. నిన్నేమనంగలను?

మర్క—(ప్రవేశించి) అమ్మా! మహారాజుగారు నిందుకొల్వుననున్నవారు. యువరాజుగారినిఁ దోడ్కొని రమ్మనినారు. ఏమి సెలవు?

లీలా—(నిర్ఘాంతపడి)

మ. మునునిందుప్రిండబునన్నుఁబట్టుకొనినా । పుత్రున్ వెసన్ ద్రుంపఁగా
జనుచుండంగను నారదుండు గని యా । జంభారితోఁ జెప్పి మా
న్పెను మన్నాథునియుద్యమం బకట! మాన్పింపంగ నెవ్వారికిన్
గనశక్యంబగు నేమిదోఁచదయె నా । కర్మం బదెట్లున్నదో?

ప్ర—అమ్మా!

మ. భయముం జెందకుమమ్మ! విష్ణువెపుడున్ । భద్రంబుగాఁ బ్రోచునన్
బ్రియమాతా! జనకుండుబిల్చెనఁట సం । ప్రీతిన్ ననున్ గొల్వకున్
రయమారంజని తండ్రిప్రశ్నలకు సా । రం బెద్దియో తెల్పి నే
నయమారం జనుదెంచువాఁడ జననీ! । నన్ వేగ దీవింపుమా.

లీలా—నిశ్చలహృదయుండవగు నిన్నేమనంగలను. పోయిరమ్ము.

మర్క—యువరాజా! ఇటు. ఇటు. (నిష్క్రమింతురు.)

తురీయరంగము.

స్థలము—హిరణ్యకశిపుని సభ.

[హిరణ్యకశిపుఁడు, చండామార్కుఁడు ప్రవేశింతురు.]

హిర—(క్రోధముతో) గురువరా! తదనంతరం బేమిజరిగెను?

చండా—తరువాత నో దనుజనాయకా! బాలకు లందఱు హరిభజనానందసుందరమనోహరవిందులగుచుఁ బరవశత్వంబున నున్న సమయంబున నేను వారింగని వారల ప్రౌఢ్యమంబంతయు మాన్ప నెంచితిని గాని వ్యర్థమైనది. వారలనుదండింపఁబోవఁగా వారలు నన్నుం గాంచి "అయ్యా! నేఁటినుండియు మేము నీ శిష్యులముగాము. మమ్ము దండించకుఁ"డనిరి. తరువాత ప్రహ్లాదునిం బిలచి యేల నీకీవెఱ్ఱి యని యడుగుచుండగా నాతఁడు గురువర్యా!

చ. తిరమగు నిష్ఠబూని—(అనుపద్యమును జదివి)

అని నాకు హితబోధ యవలంబించి యున్నాఁడు.

హిర—(క్రోధముతో) అరే! కులఘాతకీ! మనవంగడమున కపకృతి సల్పిన యానీచుని భజియించుట కంధుండవా? లేక దుర్మదాంధుండవా? నీపినతండ్రిని మర్దించిన యా ముర్కిడి తెక్కలిరాయునిం బొగడిన నీ కేమిలాభమురా వాచాటా! బూతుపగిది సంతత మావిష్ణువునే భజించుచుంటివేమిరా!— గురువర్యా!

క. సుతుఁడంచును మది నెంచక
సతతము దండించువాఁడ । సత్యంబిది దు
ర్మతియగు హరిఁ గొలువక, స
న్మతిఁగొని నను వేఁడకున్న । మత్ఖడ్గమునన్.

[ప్రవేశము ప్రహ్లాదునితో దుర్ముఖుఁడు.]

దుర్ము—దేవా! మీ యాజ్ఞమెయి బ్రహ్లాదునిం దోడ్కొనివచ్చితిని.

ప్ర—జనకా! నమస్కారము.

హిర—(క్రోధముతో) విష్ణువును భజియింపవలదని పలుమాఱునొక్కి చెప్పినను వినక యా వాసుదేవు నెట్లు భజియింపుచుంటివిరా? మూర్ఖా!

ప్ర—(వినయముతో) జనకా! మనోవాక్కాయకర్మంబులచేత—

హిర—(అదరిపడి) ఆఁ, ఏమి నీ పొగరు. భగవంతుం డన నెవ్వఁడు? ఎచ్చటనుం గానరాఁ డేమికతము?

ప్ర—జనకా! మనోనిగ్రహత గలవారికే—అనగా త్వక్చక్షు శ్రోత్రజిహ్వాఘ్రాణంబులను జ్ఞానేంద్రియంబులును వాక్పాణి పాద పాయూపస్థములను కర్మేంద్రియంబులం గెల్చిన వారికే పరాత్పరుండు గాన్పించును గాని పరులకుఁ గాన్పింపఁడు.

హిర—ఎచ్చటను గానరానివాఁ డెట్టి భగవంతుం డెటు భక్తులం బ్రోచును?

ప్ర—జనకా! యిటు వినుము.

ఉ. ఉండియు భాస్కరుండు గడు । నొప్పుగ నాకసమందు, వెల్గుభూ
మండలి కిచ్చురీతి నల । మాన్యచరిత్రుఁడు విష్ణుమూర్తి బ్ర
హ్మాండములోన నంతటను । నద్భుతలీలఁ బ్రకాశమానుఁడై
నిండు వెలుంగు నిచ్చుటయె । నిర్మలనైజము దానవేశ్వరా!

హిర—ఔరా! మూర్ఖుఁడా! పెక్కులు పాఠశాలలుంచి పలుతెఱంగుల విద్యాభివృద్ధిఁ జేయనెంచియుండ నా యుద్యమంబునకుం బ్రతికూలంబుగాఁ జేయుచుంటివిగా? దుష్టమార్గానువర్తీ!

ప్ర—తండ్రీ!

సీ. కౌస్తుభాలంకారుఁ । బ్రస్తుతింపుమటంచు
వేడ్కతోఁ జెప్పెడి । విద్యవిద్య
పద్మనాభునిభక్తి । భజియింపుమని బోధ
వీనులారఁగఁ జేయు । విద్యవిద్య
వాసుదేవునిఁ జాల । వర్ణించి కడుభక్తి
విడువక బోధించు । విద్య విద్య
వైకుంఠు చరితము । ల్పఠియించి నిరతంబు
వినిపించు నట్టిదే । విద్యవిద్య
తే. గీ. యట్టివిద్యయె విద్య యీ । యవనిలోనఁ
జెలఁగి విద్యాభిమానంబు । గలదటంచు
డంబములు బల్కి తుదకు మా । ఢ్యమ్ముఁగల్గి
శౌరిఁగనలేని బోధనల్ । సలుప నగునె?

హిర—(తనలో) అక్కటా! ఇప్పు డేమిచేయుదును? పగవానిని భజియించుచుండెనను కోపపాశం బొకవైపునకును, బుత్రవాత్సల్యపాశం బొకవైపునకును బిగియించి లాగుచున్నయవి. ఏమిచేయుదును? (ఆలోచించి ప్రకాశముగా) తనయా! చిఱుపాపవగుట నీతప్పు సైరించితి. నావాక్యంబు లించుకవినుము.

ఉ. కూటికి గుడ్డకుఁ బరుల । కొంపకుఁ జేరిన బిచ్చగాని నీ
వేటికి దేవదేవుఁడని । యెంచి భజింపుచునుంటి వోర! య
మ్మేటిని యుద్ధరంగమున । మించి జయించిన నన్నె నీవు ము
మ్మాటికి దేవదేవుఁ డని । మానసమందునఁ గొల్వకియ్యెడన్.

పలుమాఱులు నొక్కి నొక్కి చెప్పుచుంటిని. నన్నెదిర్చి చెడకుము.

ప్ర—జనకా! ఎన్నిజయించిననేమి? మనోనిగ్రహత లేని—అనఁగా నింద్రియంబుల జ్జయింపంజాలని నీవెట్లు భగవంతుండ వయ్యెదవు? ఇంద్రియనిగ్రహంబుఁ గలిగి యాద్యంతంబులు లేక

స్వయంభువుమైన యీ మహాతేజంబే భగవంతుండని యెఱుం గుము.

హిర—ఓరోరి వాచాటా! గుఱ్ఱమువచ్చి పిల్లను బెదరించినట్లు నన్నే యాక్షేపించుచుంటివిగా? ఔరా! నీవెంతకైనం దగినవాఁడవు రా! మూర్ఖా!

[ప్రవేశము- లీలావతి విచారగ్రస్తయై]

లీలా—ఎంత చెప్పినను వినక పంతగించి నాయండనే విష్ణుభక్తి వీడ నని పట్టుఁబట్టియున్న నా కుమారుం డీ విషయంబునఁ దన తండ్రియెడ నెట్లు ప్రవర్తింపుచుండెనో గదా? అయ్యయ్యో! యేమి యుపద్రవంబు సంభవింపనున్నదియో గదా? రాజాజ్ఞ యైనదని దుర్ముఖుండు చెప్పినప్పటినుండియు నామనం బూరక జేయివెట్టి కలఁచుచున్నట్లున్నయది. (కుడికన్నదరుటసూచించి) ఆఁ ఏమిది! నాదక్షిణ నేత్రస్పందము. ఈయనిమిత్త మేది యో యాపద ఘటిల్లునని ప్రబోధించుచున్నయది. (అని ముందునకుం జూచి భయ మభినయించుచు) మన్నాథుండు ప్రచండకోపోద్దీపితమానసుండై యున్నట్లు గన్పట్టెడి కార ణం బేమై యుండును? (ఆలోచించి) కారణంబునకై వెదుక నక్కఱలేదు. సుతుండు విష్ణుభక్తుండని యెఱింగినవాఁడై వల దని బోధింపఁ బ్రహ్లాదకుమారుండు వినకుండుటచే నాగ్రహా యత్తచిత్తుండై యుండనోపు. ఇప్పుడు నేనాయనకడకుం జని తగినవాక్యంబులచే శాంతిపరుపఁ బ్రయత్నించెదగాక. (అని నెమ్మదిగా దగ్గఱకుంజని) ప్రాణేశ్వరా! మీప్రాణేశ్వరి లీలా వతి యిదే ప్రణమిల్లుచున్నయది గైకొనుండు.

హిర—(వినుపించుకొనకయె) అరే! మూర్ఖా! దుర్మదచిత్తుండగు నా

హరిందలంచి యాతనిపైఁ బాటలం బాడిన నీ కేమిలాభమురా

చెనఁటీ !

ప్ర—తండ్రీ!

సీ. ముక్తికాంతారూఢ । మోహన నృత్యముల్
హరినామకీర్తన । లవనిమీఁద
సత్యలోకముదాఁక । సరణిఁ గూర్చెడితోవ
హరినామకీర్తన । లవనిమీఁద
దరిలేని దుఃఖాబ్ధిఁ । దాఁటఁజేసెడినావ
హరి నామకీర్తన । లవనిమీఁద
ఘనపాపవృక్షముల్ । ఖండించు ఖడ్గంబు
హరినామకీర్తన । లవనిమీఁదఁ

తే. గీ. బుణ్యమార్గంబులకు నెల్లఁ । బుట్టినిల్లు
కామితార్థంబు లిచ్చెడి । కల్పభూజ
మరసిచూడంగ భక్తుల । కురువిభూతి
హరిని గీర్తించుకీర్తన । లవని తండ్రి

అట్టి పాటలను విడువ నాకుం బొప్పునే? మఱియు,

"సీ. కమలాక్షు నర్చించు । కరములు కరములు
శ్రీనాథు వర్ణించు । జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు । చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు । శిరము శిరము
విష్ణు నాకర్ణించు । వీనులు వీనులు
మధువైరి దవిలిన । మనము మనము
భగవంతు వలఁగొను । పదములు పదములు
పురుషోత్తమునిమీఁది । బుద్ధి బుద్ధి

తే. గీ. దేవదేవునిఁ జింతించు । దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు । చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి । గురుఁడు గురుఁడు
తండ్రి! హరిఁ జేరుమనియెడి । తండ్రి తండ్రి" (భాగవతము)

కాన నాప్రార్థన మాలించి నన్నుఁ గరుణించి నాయుద్యమంబును మాన్పకుఁడు.

లీలా—(ప్రహ్లాదుని బ్రతిమాలుచు) ఎన్నివిధముల బ్రతిమాలినను వినక నీకింత పంతమేలరా తండ్రీ! తండ్రితో వైరమూనుట న్యాయమా? నీపితృవాక్యంబుల కడ్డుపల్కి వాని కాగ్రహంబు దెప్పింపకు.

హిర—(లీలావతిని గెంటి మేఘగర్జనస్వరముతో) ఓరోరి డింభకా! ఏమి నీవాచాలత్వము మేర మీఱుచున్నయదే? బూతుపగిది యూరక భగవంతుండు భగవంతుండని పొగడెద వేలరా దుర్మతీ! వానిపై భక్తిమానెదవా? లేదా? నీమనోనిశ్చయముం దెల్పుము.

ఏకతాళము. పంచచామరవృత్తము. సింధుకమాచిరాగము.

ప్ర-(సౌమనస్యముగా) మనీషివైననీవెయిట్లు । మాటలాడ న్యాయమే
హిర-(పండ్లుకొరుకుచు)చనంగ గూడదిట్ట్రతోవ। చాలుజాలుమానురా
ప్ర-(వినయముతో) మనోజ్ఞమూర్తిచింతనంబు । మానరాతరంబొకో?
లీలా-(బతిమాలుచు) వినంగరాదె తండ్రిమాట । వీనులారఁబుత్రికా!
హిర-(కోపముతో) గుణంబులేనివాని నీవు । గోరుటేల మూర్ఖుఁడా!
ప్రహ్లా-(వినయముతో) గుణంబులేదుగాన నేను । గోరియుంటివానినే!
హిర-(గెంటుచు) కనంగరూపహీనునిట్లు । గాంక్షఁ గొల్చెదేలరా?
ప్ర-(వినయముతో(కనంగరూపహీనుఁడౌట । గాంచఁగోరితయ్యనే!
లీలా-(దగ్గఱగాఁ దీసి)మనంబునందువీడుమయ్య! । మాసతీసుకీర్తనల్

ప్రహ్లా-(తల్లితో) మనంబునందు వానివీడ । మాత! వందనంబిదే!
హిర-(భార్యతో) మనోహరాంగి! వీడు, పెక్కుమాట లేల, బల్కఁగా
లీ-(బతిమాలుచు)మనోహరాంగపుత్రుపైన। మానుడయ్యకోపముల్
హిర-(ప్రహ్లాదునితో) మనంగ బుద్ధిలేదె నీకు । మానసంబునందునన్
ప్ర-(తండ్రితో) గనంగ నిష్టమున్నయట్లు । గాలమెల్లఁ బోవునే?
హిర-(గెంటుచు)క్షణంబుతాళ మింకనిన్ను । సైపఁజాలమూర్ఖుఁడా!
లీలా-(విచారముతో) గనంగ జాలనిట్టిబాధ । గన్నులారదైవమా!
హిరణ్యకశిపుఁడు (లీలావతిని దూరముగా గెంటగా తూలికిందపడకుండ నాపుకొని పైఁటచెరఁగుచేఁగన్నీరు రుడుచుకొనుచు హిరణ్యకశిపుని కాళ్ళవద్దఁ గూరుచుండి బ్రతిమాలుచు)

ఉత్సాహ.

విమలమతిని సుతునిఁ బ్రోవ । వేఁడుచుంటి మిమ్ములన్
హిర—భ్రమరవేణి! నీదుకోర్కెఁ । బాటిసేయ నియ్యెడన్
లీలా—రమణ! రమణ! నీదురమణి । ప్రార్థనంబు వినవుగా
హిర—కుమతి యిట్టులేల నాదు । కోపమీవు పెంచెదే?
ఓదుష్టపిశాచమా! లీలావతీ! నీకారణంబుననే యాప్రహ్లాదుండు చెడిపోవుచుండెనని తలంచెదను. కాబట్టి నీ వీ విషయంబున మఱుమాటఁ బల్కకుము. అట్లు పల్కితివేని నిన్ను తుండెతుండెంబులక్రింద నఱికి తీరెదను. జాగ్రత్త. (సేవకునితో) ఓరీ! నీవతిరయంబునం జని యెట్లున్నట్లు రమ్మని నా యాజ్ఞగాఁ దెల్పి మంత్రియగు విప్రజిత్తి నిటకుం దోడ్కొని రమ్ము.

దుర్మ—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)
హిర—ఓరీ! ఇంకొక్కపరి నిన్నడిగిచూచెదను. అందులకు ప్రతి

రేకంబుగాఁ బ్రవర్తించెదవేని నీమానప్రాణంబులు నీకుం దక్కవు. ఏమనియెదవు? విష్ణుభక్తి మానెదవా లేదా?

ప్ర—నా నిశ్చితాభిప్రాయం బీవఱకే మీా కెఱింగింపఁబడియె. వేతే నన్నడుగ నేల?

హిర—గత్తు. తగదు తగదు మూర్ఖుఁడా!

ప్ర— తగదు తగదు కోపమున్

హిర— పగతు నిటుల గొల్చెదే

ప్ర— పగతుఁ డెవఁడు యెంచఁగన్.

హిర—(కోపముతో కత్తియెత్తి) ఆఁ దుష్టపుత్రకా! ఇదే చచ్చితి విరా! (అని మీాఁద కుఱుకును.)

లీలా—(అడ్డుగాఁజనియేడ్చుచు)నాథా! శాంతింపుఁడు. శాంతింపుఁడు.

హిర—(లీలావతిని దూరముగా నెంటి) ఛీ! ఛీ! దుర్మార్గురాలా! దూరంబుగా నుండుము. అడ్డంబుగా వచ్చిన నిన్నుం గూడ ఖండించెద.

మర్మ—(ప్రవేశించి) దేవా! తమ యాజ్ఞమెయి మంత్రియగు విప్రజిత్తిం దోడ్కొనివచ్చితిని.

హిర—(పండ్లుపటపటం గొఱుకుచు) మంత్రీ! విప్రజిత్తీ! వంగడమున కపకీర్తిందెచ్చెడి దుష్టబుద్ధియగు నీప్రహ్లాదుండు—ఛీ! ఛీ! వీని నామ ముచ్చరించిన మహాపాతకము. మనవైరియగు విష్ణువునిఁ బొగడుచు నాప్రాణవాయువుల నొప్పించుచున్నవాఁడు.

లయగ్రాహి.

వీఁడుఁ గడు దుర్జనుఁడు । చూడు మలశ్రీధరుని
వేఁడుచును బాటలను । బాడుచును నుండెన్

వీడుమని చెప్పినను । వీడడయె విష్ణువుని
వేడఁ డొాగి నన్గరుణఁ । జూడుమను పల్కుల్
గూడుకొను ప్రేమ దిగ । నాడితిని గాన గడు
వాఁడిగల ఖడ్గముల । తోడఁ గడువేగన్
పోడిమిని సంశయము । వీడుచు మదర్భకుని
తాడనము సేయుఁ డిఁకఁ । బీడఁగొని చావన్.

ప్ర—తండ్రీ! కం. శిక్షింపఁగ, రక్షింపఁగ
దక్షుం డల హరియె గాని । దలపోయంగా
నీక్షోణీతలమందున
రక్షోనాయక! యొరులక । రయ సాధ్యంబే?

హిర—నామాట యెంతమాత్రమున్విశ్వసింపక హరీ! హరీ! యని పరి పరివిధంబులఁ బ్రేలుచుంటివిగా? కానిమ్ము. ని న్నా హరియే రక్షించుఁగాక. విప్రజిత్తీ! రాజపుత్రుండని శంకింపక, కోపావేశంబున నాజ్ఞాపించితినేమో యని సంశయింపక, రాక్షస కులంబునకుఁ గళంకముఁదెచ్చిన, యీకులద్రోహి, నీపితృఘాతకుండే యేమార్గంబులఁ జచ్చునో యాయామార్గంబులన్నియు అనఁగా వేయేల; తుద కగ్నింబడవైచి యైననుసరియే వీనిని ప్రమందించి సత్వరంబుగ రమ్మని దండనాధుండగు విరూపాక్షునకు నా యాజ్ఞగాఁ దెల్పి తదనుచరుండవై నీవుఁగూడఁ బొమ్ము. సంశయింపకుము.

లీలా—(మహాదుఃఖముతో) నాథా! నాథా!! ఈచిఱుతపై గరుణవహింపుమా! నాముద్దుచెల్లింపుమా! రక్షింపుమా! రక్షింపుమా!

హిర—ఛీ! ఛీ! నీవు నాయెడ నిట్టిప్రశంసందేకుము (అని లీలావతిని గెంటి) మంత్రీ! సందేహింపకాలసింపక కడువేగంబునఁబొమ్ము.

(నిష్క్రమించుచున్నాఁడు)

విప్ర—ప్రహ్లాదా! నడువుము. (ప్రహ్లాదునితో నిష్క్రమించుచున్నాఁడు.)

లీలా—(ప్రహ్లాదుఁడు పోవుచుండఁగాఁజూచి గద్గదస్వరముతో) హా! కు-మా-రా! పోవుచుంటివా? హా! హా! హా! హా!

(మూర్ఛిల్లును.)

ఇది తురీయాంకము.

తే. గీ. ధరణి పుసులూరివంశాబ్ధి । వరయశుఁడయి
వరలు సూర్యప్రకాశు నా । హ్వాయుని మనుమఁ
డైన సుకవి సోమేశ్వరా । హ్వాయునిచేత
వ్రాయఁబడె నిది భూమిపై । వరలుగాత.

శ్రీ

ప్రహ్లాద

పంచమాంకము—ప్రథమరంగము.

స్థలము—పర్వతముల గుంపు.

[ప్రహ్లాదునితో విరూపాక్షుఁడును, విప్రజిత్తియుఁ బ్రవేశించుచున్నారు.]

విప్ర—(అపవారించివిరూపాక్షునితో) విరూపాక్షా! ఏమియాశ్చర్యము!

సీ. స్రుక్కఁడయ్యెను గదా? । దిక్కుంభియూధముల్
పాదంబులం ద్రొక్క । బాలకుండు
మడియఁడయ్యెను గదా? । వడిఖడ్గములతోడ
నలయించి బొడిపింప । నర్భకుండు
క్రుందఁడయ్యెను గద్దా? । రంధ్రముల్ బిగియించి
దయలేక బాధింప । దారకుండు
పోవఁడయ్యెను గదా? । భూమిలోఁ బాతించి
చంపఁగాఁ జూచిన । శాబకుండు

తే. గీ. చేయ, నభిచారహోమంబు । శీఘ్రగతిని
ప్రాణము లీడ్వఁగా లేదె । బాలకుండు
యెఱుఁగఁడే? జీవనాథ । మింత మెన
యెటుల బ్రతుకుచుండెనో । యెఱుఁగరాదు

కానిమ్ము. ఇప్పుడీ శైలాగ్రంబునకుం దోడ్కొనివచ్చితిమిగదా? ఇచ్చటనుండి బాలుని క్రిందకుంబడఁద్రోసితిమేని యప్పుడైన నీతం డసువులం బాయకుండు నేమో జూతము. (అని ప్రహ్లాదునితోఁ బ్రకాశముగా) ప్రహ్లాదా! లెక్కకు మిక్కుటంబగు బాధ లెన్నియో బెట్టితిమే? వానినన్నింటి నెట్లు సైచుచుంటివో యెఱుంగరాకున్నయది. నిన్ను బాధించుటకు మాకుఁ జేతు లాడకున్నయవి. నీవు విష్ణుభక్తిఁ బరిత్యజించుమా?

ప్ర—అయ్యలారా! మీకిష్టంబగు నన్నివిధంబుల బాధింపుడు. నేనోర్చెద కాని విష్ణుభక్తి వీడుమనిమాత్రము మీరు నాకుబోధింపకుఁడు. మఱియు బాధ లెట్లు సైచుచుంటివని యడిగితిరి గాని యందు నా ప్రజ్ఞావిశేషం బేమియు లేదు. ఇటువినుండు.

తే. గీ. అవ్యయానందు, గోవిందు, హరి ముకుందుఁ
బ్రవిమలాకారుఁ, బంకజ పత్రనేత్రు
భవ్యచారిత్రు, సంసార భయవిదూరు
స్థిరమతినిఁ గొల్వ బాధలు దరికిరావు.

కావుననే,

మ. స్థిరభావంబునఁ గొల్చుచుంటి మదిలో శ్రీనాథుఁడై, యీశుఁడై
హరియై, కేశవుఁడై, పరాత్పరుఁడునై, యంతర్గతజ్యోతియై,
పరుఁడై, పాపవిమోచనుండయి, కృపా వారాశియై, శౌరియై
సురముఖ్యప్రణతైకుఁడైన సుజన స్తోమాఘచింతామణిన్.

విప్ర—అటులైనమా ప్రయత్నం బేమియు లేదు. విరూపాక్షా! ఈ శైలాగ్రంబుననుండి వీనినిఁ గ్రిందఁబడఁద్రోయుము. సంశయింపకుము.

విరూ—చిత్తము. (అని ప్రహ్లాదుని శైలాగ్రంబునఁ బరుండఁబెట్టుచున్నాఁడు.)

ప్ర—(పరుండియే ముకుళిత హస్తుఁడై) ఓ దేవాదిదేవా! యజ్ఞా

ధిష్ఠవు, నిత్యముక్తుండవు, పరిశుద్ధుండవు, పరంధాముడవు, పరంజ్యోతివగు నీదివ్యపాదారవిందధ్యానైకచిత్తుండనై యుంటి ననినాపై నీర్ష్యవహించి నన్ను మడియింప నీశైలతటంబునుండి క్రిందకుం బడఁద్రోతురఁట. ఓ కరుణామయా! చరాచర సమస్తభూతసకలప్రదేశంబుల నంతర్బాహ్యంబులయందును నివ్వరిముల్లుచందంబునం బ్రకాశించుచున్నట్టి నీ వీ శైలంబునందుండువని వీరెఱుంగరైరి. మహానుభావా! నన్నుద్ధరింపుము.

తే. గీ. విషయసంబంధజన్యమై । వెలయునట్టి
యలఘు సంసారసౌఖ్యముల్ । దొలఁగఁజేసి
నిర్మలంబైన నీభక్తి । నీయఁగదనె
చిరశుభాకార! మోక్షల । క్ష్మీవిహార!

విరూ—(శైలాగ్రముననుండి ప్రహ్లాదునిం బడఁద్రోయును.)

ప్ర—(క్రిందికిదొర్లివచ్చి లేచి చేతులుమోడ్చి) హే! మహానుభావా! పాపరహితా! ఒకపరి జగముల వెలుపలను, మఱియొకపరి లోపలను నిడుకొని యుభయంబు నొక్కదృష్టినీక్షించు సకలార్థసాక్షివగు నీఘనలీలామహిమార్ణవం బెఱుంగ నెవ్వరికి శక్యంబగు. హేతండ్రీ! భక్తజనమందారమా! భక్తజనానురక్త్యాసక్తవిలోకనుండవగు నో పురాణపురుషా! మాం పాహి మాంపాహి.

విరూ—దేవా! ఈ సమయవృక్షం బీపర్యాయమునఁగూడ వెనుకటి ఫలంబే యొసంగినది.

విప్ర—కానిమ్ము. వీనింగొనిపోయి కూలంకషోల్లోలజలనిధిలోఁ బారవైతమురమ్ము. (అని ప్రహ్లాదునితో నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయరంగము.

స్థలము:—సముద్రము.

[ప్రహ్లాద, విరూపాక్ష, విప్రజిత్తులు ప్రవేశించుచున్నారు.]

ప్ర—హే! విశ్వాత్మక! పృథివ్యాప స్తేజోవాయురాకాశములును పంచభూతములును, శబ్దస్పర్శరూప రసగంధములను పంచవిషయములును, త్వక్ చక్షు శ్శోత్ర జిహ్వాఘ్రాణంబు లను పంచేంద్రియములును, వాక్పాణిపాదపాయూపస్థములను పంచకర్మేంద్రియములును, మనోబుద్ధి చిత్తాహంకారములను నంతఃకరణచతుష్టయములును ననునీ ప్రకృతిస్వభావంబులన్నియు, నీయందే మందీభూతమగుచున్నవి గదా ?

శా. నిత్యానిత్య వివేక వేదులు మహా । నిష్ఠాత్మ లేరూపముక్
మత్యంతంబులఁ గాంచి నిశ్చలతరా । నందాంబుధిస్థలి రా
గత్యాగంబున రశ్మిసంకలిత వి।జ్ఞానంబు గైకొందు రా
సత్యంబైన స్వరూప మీవె కద భా।స్వద్దీనచింతామణీ!

విప్ర—విరూపాక్షా! ఇదేమియో మహాద్భుతంబుగానున్నదే? ఏమి యీయాశ్చర్యము! మహోన్నతమైన పర్వతరాజంబుపైనుండి క్రిందబడవైచినను, బాలుండిసుమంతయుఁ గందఁడయ్యెనే? వీని వద్ద నేదియో మంత్రికశక్తి యున్నయట్లున్నది. కానిమ్ము. చూతము. వీని నిప్పుడీ మహాభీలజలార్ణవంబునఁబడ వేయుము.

విరూ—చిత్తము (అని యెత్తి సముద్రములోఁ బడవేయుచున్నాఁడు.)

ప్ర—(ఒకటి రెండు నిమేషంబులాఁగి లేచి నిలచుండి ముకుళితహస్తుఁడై) ఓకరుణాకరా! భవరోగభిషగ్వరా! దామోదరా! జననాకారకర్మాహ్వయచేతనాదివిశేషంబులయందును, నాధ్యాత్మికాధిభౌతికసంచిత క్రియావిజృంభణంబులయందును, విరహి-

తుండవై తామరాకునందలి జలంబుచందంబున విలోలుం డవుగాక సృష్టిస్థితిలయవ్యాపారత్వంబునం బ్రకాశించెడి యో పరబ్రహ్మస్వరూపమా! మాంపాహి—మాంపాహి.

విప్ర—(ఆశ్చర్యముతో) విరూపాక్షా! నాప్రాణములు విసిగిపోవుచు న్నయవి. వీని నెన్నివిధంబుల నొడియింపనెంచినను జచ్చుట లేదే. ఎంతకాలము వీనితోఁగూడ మనము బాధలుపడుట. అబ్బబ్బా! వీనినింబెట్టుబాధలఁ జూడలేక నాకండ్లు మూతలు పడుచున్నయవి. (తలపంకించుచు) కానిమ్ము. రాజాజ్ఞచొప్పు న కడసారి వీనిని గణగణమండుచున్న మహానలంబునం బడవే యుదము రమ్ము. అప్పటికిని జావకున్న వీనిని జంపుట మాత్ర రమయినది గాదని రాజున కొప్పగింతము.

విరూ—అగునగు నెంతకాలము మనకీయుద్యోగము. పోవుదమురండు.

(అని ప్రహ్లాదునితో నిష్క్రమించుచున్నారు.)

తృతీయరంగము.

స్థలము—అగ్ని.

[ప్రహ్లాదునితో విరూపాక్ష, విప్రజిత్తులు ప్రవేశించుచున్నారు]

ప్రహ్లా—ఆర్తరక్షణపరాయణా! నారాయణా! ఆపద్బాంధవా!

శా. నీకారుణ్యముగల్గఁబట్టిగద యో! నీరేజపత్రేక్షణా!
వీకన్ బోవకనిల్చె బ్రాణములు పృథ్విన్ వార్థిలోద్రోయఁగా
నాకర్ణింపవె, మన్మహార్తినిఁక నీ యగ్నిన్బడన్వైవ న
స్తోకత్వంబున బ్రోవరావె సుజన స్తోమాఘచింతామణీ!

విప్ర—ప్రహ్లాదా! కడసారి నావాక్యంబు లాకర్ణింపుము. చెడకుము.

హావ్యవాహనుండల్లదే కడుంగడు బ్రజ్వరిల్లుచున్నవాఁడు. ఏమని యెదవు? తరువాత మా యత్నం బేమియు లేదు. మా మాట వినుము.

విరూ—నాయనా! ఈమంత్రిశేఖరుని వాక్యంబు లాకర్ణింపుము.

ప్రహ్లా—అయ్యలారా!

తే. గీ. పంచభూతాత్మకం బౌచుఁ । బరిణమించు
నట్టిదేహంబు శాశ్వతం । బగునె జగతి?
నెమ్మి "జాతస్యమరణం ధ్రువ" మ్మనంగ
వినియు, నే నెట్లు హరిభక్తి । విడువఁగలను.

కాఁబట్టి మీరు మీమీయుద్యోగంబుల నెఱవేర్పుడు. సంశయింపకుఁడు. తల్లిసంతసించుననియు, జనకుండాగ్రహంబువీడుననియు మీరు బాధలం బెట్టిరనియు, మనంబునం దలంచి విష్ణుభక్తి మానెదననుకొనుచున్నారా? అట్లెన్నటికినిం దలంపకుఁడు.

విప్ర—సరే మా వాక్యంబుల వింటివేని బాగుపడియెదవనుకొంటిమి. అట్లుగాక నిర్భాగ్యత నిన్ను నెత్తిపైఁ దన్నుచుండ మే మేమి చేయగలము.

విరూ—(ప్రహ్లాదుని బట్టుకొనుచున్నాఁడు.)

ప్రహ్లా—(కరములుమోడ్చి నిమీలితలోచనుండయి)

మ. వరవైకుంఠపురంబునందుఁ గడు దివ్యస్వర్ణ శాలాంకగో
పురహేలాన్వితమైన మేడపయినన్ । బాల్పారుశ్రీదేవితోఁ
గర మొప్పారెడు నీదునామము జగత్కల్యాణ నేఁగొల్తు భా
సురలీలన్ ననుఁ బ్రోవుమయ్య! సుజన । స్తోమాఘచింతామణీ!

శా. నిత్యంబై, నిఖిలార్థదంబగుచు వర్ణింపంగ రాకున్నదై,
సత్యంబై, సదసద్వివేక గుణసం । స్కారప్రమోదాత్మసా

పత్యంబై, శుచియై, మహామహిమమై, ॥ భాసిల్లు నీరూప మే
నత్యంతంబు భజింతుఁ బ్రోవఁగదవే? ॥ జ్యాయఃకళాపూర్ణమా!

విరూ—(ప్రహ్లాదుని నగ్నిలోఁ బడవేయుచున్నాఁడు. అగ్ని చల్లారును)

విప్ర—(తనలో) ఔరా! ఈతఁడు త్రైలోక్యసమ్మోహనేంద్రజాలకుఁడుగాని బాలకుండుఁగాఁడు. ధైర్యమన్న నీతనిదే ధైర్యము. మనోనిగ్రహత్వంబును, ధైర్యస్థైర్య ధుర్య గాంభీర్యంబులును, భగవద్భక్తియు, నీతని కలంకారములు గదా? (ప్రకాశముగా) విరూపాక్షా! వీనిని మడియించుట మనకుశక్యముగాదు. కావున మన మొనరించిన మారణోపాయఁబులును, దానికింగలిగిన ప్రతిఫలంబును, సానుపూర్వకముగా మన యేలికకు నివేదించిన మన కీతని బాధించెడిబాధ తొలంగును. రమ్ము పోదము.

విరూ—చిత్తము. (అని అందఱు నిష్క్రమింతురు)

తురీయరంగము.

స్థలము:—సభాభవనము.

[హిరణ్యకశిపుఁ డుచితాసనముపైఁ బ్రవేశించుచున్నాఁడు]

హిర—(విచారముతోఁ దనలో) నే నెంతమందభాగ్యుంగుడను. కన్న కుమారుని - నావంశాంకూరమును - నాముద్దులపుత్రకుని- ద్రమందించుమని యాజ్ఞనిచ్చితినే? నావంటి నిర్భాగ్యుం డెందైనం గలఁడా? పసికూనయగుటచే నాకుఁ బ్రబలవిరోధి యైన విష్ణువునందలి భక్తి నిలిపి మిక్కిలి భజియించుచుండె. కొంచెము జ్ఞానమువచ్చినతరువాతనైన విష్ణుభక్తిఁబరిత్యజించునేమోయని యైన యోజించనైతి. (ఆలోచించి) పసికూనయైనను నా వాక్యంబులయం దించుకేనియు నాదరము సూపఁడయ్యెనే? వీని

కీవిష్ణుభక్తి యెట్లులవడినది? (నిదానించిచూచి) వీరికి జనియిం
చినపరమమూర్ఖతవలన వీనికాయుఃప్రమాణవిహీనత్వంబువ
లన—నాకానందపదభ్రష్టత్వంబువలన— లీలావతిపూర్వకర్మ
పరిపాకంబువలన—(పండ్లు పటపటంగొఱుకుచు) మాయావి
యగునావిష్ణువంతర్జ్యోతియై వెలుంగుటవలన— (క్రోధముతో)
ఓరోరి! దుర్మతీ! కులగోత్రరూపవిహీనా! నిన్నీక్షణంబులోపల
ప్రమందించి, నాతమ్మునింజంపి, యీపసిబాలున కింతటిదుర్బోధ
యొనర్చిన నీకండకావరంబణంగించెద తొందరపడకుము. నిన్నే
సంహారింపలేనియెడ నా యీమహోత్కృష్టంబయిన వరప్ర
భావం బెందులకురా! జడమతీ!—హా కుమారా! మద్భాగ్య
రాశీ! ముద్దులకుఱ్ఱా! నీ కింతలోననే నూరేండ్లునిండెనా? నీ
పాలిటికి నేనే మృత్యుస్వరూపము నైతినా? అయ్యయ్యో!
భరింపరాని పుత్రమరణంబువిని లీలావతికూడ బ్రాణములువిడు
చునేమో? (అదరిపడి) అట్లయిన నే నీ జీవములను భరియించి
పుడమిపై మనియుండఁగలనా? (ఆలోచించి) ఓ విధాతా!
సృష్టికర్తా! సత్యలోకాధీశా ! వాణీమనోహరా ! హంసవా
హనా! నీవిచ్చినవరంబువలన నాప్రాణంబులఁ బాయుటకైనను
వలనుగాకుండవచ్చెనే? ఏమిచేయుదును? అయ్యయ్యో! పు
త్రశోకంబునతొలుతను, తదుపరిభార్యావియోగంబునుఁగల్గుట
నిశ్చయము. ముమ్మాటికిని నిశ్చయము. వీరల నిరువురందలంచి,
వీరివర్తనంబాలించి, చింతిచి, కృశించి, వగచి, యెందులకుం
గొఱగానిజీవములతో నిండిన మొండికట్టెయను, నిల్పిననేమి ?
నిల్పకున్ననేమి? అట్లని చావంగలనా?విధాతప్రసాదించిన వర
ప్రభావంబుచే నాకుఁ జావుకలుగదుగదా? హాః ముమ్మా
టికినిగలుగదు. (అని తెరవైపుఁ జూడఁగా విరూపాక్ష, విప్ర

జిత్తు లిరువురే కనంబడినట్లభినయించి వడఁకుచు) అ-అ-అల్ల-దేవిరూ.. పాక్ష- వి- ప్ర-జి-త్తు-లరు- దెంచుచున్నారు-కుమారుండు-స్వర్గలోక- ప్ర- యాణమై- పోయినట్లుఁ- గాన్పించె-డి. అక్కటా! నాయవస్థయెంతవఱకువచ్చినది. వీనివిష్ణుభక్తియెంతవఱకుఁ బరిణమించినది. (గుండెలుబాదుకొని) నా-కఠినమైన-మీఁరుటకువీలులేనిదుర్ఘటంబులగు నాయాజ్ఞలనువీరు నెఱవేర్పకుందురా? ఆబాధలం బడఁజాలక-నా-పసికూన-లోకజ్ఞానమిసుమంతయులేని శాబకుఁడు- ముక్కుపచ్చలారనిచిన్నినిసుంగు-స్రగ్గకుండునా? అయ్యయ్యో! నావంశము నేఁటితో భస్మీభూతమగుచున్నది. (క్రోధముతో) ఓరోరిరాక్షసకులవిద్వేషీ! వైకుంఠవాసా! నీకారణంబున మద్వంశార్ణవంబింకిపోయినది. కావున నీప్రాణాపహరణంబుగావింపకుండ నిన్నిహిరణ్యకశిపుండు విడువఁడు. ఇంకెందుఁబోయెదవురా! దుర్మదచిత్తా! (అసితొందరగా రెండడుగులుముందునకువైచిచూచి నిర్ఘాంతపడి) ఆఁ, ఏమిది! నాకన్నులనునేనునమ్మవచ్చునా? ఆవచ్చువాఁడు నాభాగ్యరాశియగు ప్రహ్లాదుఁడుగాఁడా? నిస్సందేహముగా నాభాగ్యరాశియగుప్రహ్లాదుఁడే! (వినుటనభినయించి) ఏమిది? "చక్రిదాస్యమనెడి చక్రంబుచేఁగాక" అనియా పాడుచుండెను? వీని కీపాడుబుద్ధి వదలినదికాదుగదా? (విప్రజిత్తి, ప్రహ్లాద, విరూపాక్షులు ప్రవేశించినవెంటనే ప్రహ్లాదునిహస్తములఁ బట్టుకొని యదలించుచుఁబట్టఁజాలనికోపముతో) ఓరోరిడింభకా! ఏమంటివిరా!

ప్ర—తండ్రీ! ఏమున్నయది.

సీ. నారాయణుని దివ్య । నామాస్త్రమునఁగాక
సంసారబంధముల్ । సడలు నొక్కొ?

విష్ణుదేవుని కృపా । వృష్టిచేత నెగాక
క్రూరపాపాగ్ని చ । ల్లారు నొక్కొ?
శ్రీమనోహరు బత్తి । సింగంబుచేఁ గాక
సంతాపగజములు । జచ్చునొక్కొ?
కమలనాభుని దృష్టి । ఘనవాయువునఁ గాక
దుఃఖమేఘంబులు । దొలఁగు నొక్కొ?
ఆ. వె. చక్రిదాస్యమనెడి । చక్రంబుచేఁ గాక
మత్సర మద మోహ । మమత లనెడి
క్రూరశత్రుకోటిఁ । గూల్పఁగాఁ [illegible]నొక్కొ?
ధాతకైనఁ గాని । దానవేంద్ర!
హిర—(తలపంకించుచు) ప్రెగ్గడా! నాని[illegible] లేదా?
విప్ర—స్వామియాజ్ఞ కన్యథా చరియి[illegible]
హిర—అటులయిన వీఁడేల మడియ లేదు?
విప్ర—ఈబాలకునియందేదియో [illegible]
హిర—ఏయే బాధలం బెట్టించితివి? అందుఁగా[illegible]ంచినమహాత్మ్యం బేమి?
విప్ర—ఒకటియా! రెండా! చెప్పనలవిగానన్ని బాధలం బెట్టించితి. అందుఁ గొన్ని సంగ్రహముగావిన్నవించెద వినుండు. పుడమిలోఁ బాతించితి. శూలంబులచేఁ బొడిపించితి. గజములచేఁద్రొక్కిం చితి. రంధ్రంబులన్నియు బిగించితి. మహోన్నతంబులైనపర్వతాగ్రాజంబులనుండి క్రిందఁ బడద్రోయించితి. మహోదధిలో ముంపించితి. తుదకుమీయాజ్ఞచొప్పునఁగణకణ ప్రజ్వరిల్లు యగ్నింబడవైచితి. అగ్ని చల్లారెనేగాని బాలుఁడిసుమంతయును లొంగలేదు. దేవా! ఇంత యేల? మేమెన్ని బాధలం బెట్టినను—
ఉ. కందడు, తత్తరింపఁడు, బ్రి । కంపమునొందఁడు, భీతితోడఁదాఁ
గుందఁడు, బెట్టుబాధలకు । కోపముఁ జెందఁడు, పెద్దనిష్ఠుర

న్జైందడు, మమ్ముదూరడు వి॥ శేషముగాఁ బరమేశుఁగొల్చు నా
నందమెగాని, యోయసుర॥ నాథ! తలంపడు తల్లిదండ్రులన్.

హిర—ఏమీ! నీవేదియో గొప్పగాఁ జెప్పుచుంటివే?

విప్ర—దేవా! ఇందతిశయోక్తి యేమియును లేదు.

హిర—(ఆలోచించి) పాములవాని నొకనిని శీఘ్రగతిం బిలిపింపుము.

విప్ర—విరూపాక్షా! రాజాజ్ఞ నెఱవేర్పుము.

విరూ—చిత్తము. (అని నిష్క్రమించి పాములవానితోఁ బ్రవేశించి)
ప్రభూ! తమయాజ్ఞమెయి నీపాములవానిం దోడితెచ్చితి.

పాము—పభోరికిదండాలు,పభోరికిదండాలు, ఏలినోరుగీనీసూడాలంటే
మాసెడ్డపాములుండాయిగాసామి, సిత్తగింసండిబాబో సిత్తగిం
సండి. (అవి కూర్చుని నాగస్వరము బట్టుచున్నాఁడు.)

హిర—ఓరీ! నీవద్ద నేయేరకముపాము లున్నవిరా?

పాము—ఏరకముపాము లేంటిబాబూ! నేను యినికినేదుబాబో! దా
న్నెప్పుడు నే సూపునేదు సామి!

హిర—నీవద్దనున్న పాములపేరు లెవ్వియో చెప్పఁగలవురా?

పాము—సిత్తముబాబో (ఒక్కొక్కటేతీయుచు) ఇదిగో ఇది మల్లె
తాసు. ఇది మొగలితాసు. ఇదికిట్టచప్పం, ఇదిలేడిచుక్కల
తాసు ఫభోరుదీన్నిసూడాల. దీన్నిగంటేరసూలుకొండ తూర్పు
దిబ్బలమీాద తల్చిగ్గోచింది రెణ్నెల్లుకాచి యెరమింగినదాన్ని
పదిమందిమిఘోగడి వోడేసిపట్టినాముసామి. అప్పుడుగంటేనీ
షూవోళ్ళిద్దరినియేసిందికాటు. సచ్చిపోనారుసామి. మావోల్ల
మూలిన పాముండి.

హిర—సరియే; ఈలేడిచుక్కలనాగుచేతను, మల్లెత్రాచుచేతను యీ
బాలకుని యిసన్త్రపుల నొక్కమాఱుకఱపింపుము (అని మంత్రి

తో) మంత్రీ! నీవిచ్చటనుండి విరూపాక్ష దుర్ముఖులచే బాలకు నిబట్టుకొన జేసి యీపాములచే ప్రహ్లాదు నిగఱపించుమనుము.

పాము—బాభోయి బాభోయి మారజ్జా! మీరుదండాలు నేనీయువ రాజుగారిని కరపింపలేనుబాభో! రచ్చించండి పెభులు.

హిర—(కత్తియెత్తి జళిపించుచు) కఱపించెదవా? లేదా?

పాము—(వడంకుచు) సిత్తము. బాభోరచ్చించండి మారజ్జా! కఱపిత్తానండి కరపిత్తానండి.

హిర—ఆఁ అట్లు బుద్ధిగలిగి మసలుకొమ్ము. మంత్రీ! ఈకార్యమునం దపరిమత్తుండవై మెలంగవలయు. (నిష్క్రమించుచున్నాఁడు.)

(దుర్ముఖుఁడు విరూపాక్షుడు ప్రహ్లాదునిబట్టుకొని సరిగా నిలబెట్టుదురు)

పాము—(నాట్యముఁజేయుచు)—పాట.

లే, లే, నాగన్న ! లేడీచుక్కలనాగ
బాలుని, భక్తుని ! ప్రహ్లాదు గరువంగ॥ లే లే॥
కరసినావంటేని ! కరవెల్ల తీరునాకు
తిరుగక యొడియేసి ! కరవంగ యేగమె॥ లే లే॥
మల్లెతాసుతోడ ! సల్లంగ నీవుకూడ
వొళ్లెల్ల తెగమొడిసి ! సల్లగసంపెయవె॥ లే లే॥

దుర్మ—ప్రహ్లాదుని కఱపింపఁబోయి నన్ను కఱపించేవుసుమ్మా! కొంపతీసి ఆనక చిక్కుపడలేను. నేను చచ్చినా యిబ్బంది లేదుకాని నాకోసము చాలమంది పూర్వాసువాసినీలు మళ్ళీ విచారించడము వస్తుంది జాగ్రత్త బాబు! బాగాచూచి మరీకఱపించు.

పాము—(నెమ్మదిగా సమీపించుచున్నాఁడు.)

ప్ర—(కరములుమోడ్చి వినమ్రుఁడై) ఓ భక్తవత్సలా! ఓ పరమ

కృపాళూ! ఓజగదీశ్వరా! ఓభక్తభయనివారకా ! ఓ భక్త జనానంద సంధాయకా!

శా. కార్పణ్యంబు వహించి నాజనకుఁ డు ॥ గ్రజ్వాలసంఖేలనో
ద్దర్పప్రాభవ మైన కృత్యముల వి ॥ స్తారంబు బాధించి; దా
మార్పుంజేయుటకై హరిస్మరణముల్ ॥ మాన్పింపఁగా లేక; యీ
సర్పశ్రేణులఁ దెచ్చెఁ బ్రోవఁగదవే ॥ సర్వాత్మకా! శ్రీకరీ!

పాము—(పాములను విడుచుచున్నాఁడు.)

[ఆకస్మికముగా గరుత్మంతుఁడు ప్రవేశించి రెండుకాళ్ళతో
రెండుపాములను తన్నుకొని పోవుచున్నాఁడు.
అందఱును నిశ్చేష్టులై చూచుచుందురు.]

ప్ర—(చలించక మానసికపూజ యభినయించును.)

పాము—(విచారముతో) ఏంటిబాభో! యీసిత్తరం నా గతేంటి బాభు! అయ్యో నాకమ్మమా! దీన్నిసూసినోళ్ళల్లా రెండేసి డబ్బులిచ్చేవోరు బాభూ! అయ్యొ నాకెల్లగొత్తయింక బాభూ! (రోదనముచేయును.)

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు]

హిర—(క్రోధముతో మంత్రీ! ఏల నాయాన నిరాకరించితివి?

పాము—(ఏడ్చుచు) బాబయ్యా! నాకొంపతీశారుగాదుండి. పాడు ముండాగద్దొచ్చి నాపాముల నెత్తుకెల్లిపోయింది బాబయ్యా? నా బతుకెల్లా బాభూ! నాపెళ్లాంబిడ్డ లుసూరుమంటారు బాభూ

విప్ర—దేవా! వీనిని పాములచే కరిపింప నుద్యుక్తులమైయుండఁగా నెక్కడి నుండియో మెఱుపువలె గరుడుం డరుదెంచి యావిషో రగంబులం గబళించుకొనిపోయె. మే మేమిచేయంగలము.

హిర—(క్రోధముతో) అటులయినచో నే నియ్యెడనేయుండి వీఁడెట్లు

మఱియొకఁడో చూచెదను. నీ విప్పుడ లోనికరిగి విషపూరితంబై యున్న భృంగారకం బొకదానిని దీసికొనిరమ్ము.

విప్రు—(సందేహించును)

హిర—సందేహించెద వేల ?

విప్రు—దేవా ! మఱేమియు లేదు గాని వీ—

హిర—(క్రోధముతో) కానీ యని నుడువక సత్వరంబ జనుము.

విప్రు—(లోనికిం జని విషపూరితంబైన భృంగారంబుతో వచ్చి హిరణ్యాకశిపున కిచ్చుచుండఁగా లీలావతి ప్రవేశించి యిరువురకు మధ్యగాఁజని)

లీలా—(ఆతురతతో) నాథా! నాథా! కరుణవహింపవా ? నామనవి యాలింపవా? గర్భవాసమే? పుత్రమరణమే? భరియింపరానిదే ? అందున బలవంతముగ చేఁ జేతనే చంపుదువే? అయ్యయ్యో ! నాకడుపు చుమ్మలుచుట్టుకొనిపోవుచున్నయదే ? నీ పదరాజీవంబులంటి వేఁడెద. ప్రార్థించెద. కొంచెమునిదానించుము. బాలకునిమందించుటమాని బంధించుము. నేనోర్చెదనంతియేగాని గర్భశోకంబనుభవింపఁజాల. అనుభవింపఁజాల నాథా! ముమ్మాటికి ననుభవింపఁజాల. నాపైనున్న ప్రేమయెటుపోయె? ఎట్టికార్యమునందైనను నాయానగా నాకోర్కె జెల్లించెదనని బాసచేసితివే?మాటయిచ్చి తిరుగుట మానసీయులకుచితమా? (పట్టరానిదుఃఖముతో పదములపైవ్రాలి యేడ్చుచు) అబ్బబ్బా! ఈవిచారంబు భరియింపఁజాల. ఈచిన్నారి కన్న సుకుమారుని జంపించెద వేల?పగవానిపై బడిపగదీర్చుకొనుటయుత్తమముగాని-కన్నకుమారునిపై-వంశాంకూరముపై - పున్నామనరకంబు పోగొట్టువానిపై-యువరాజు- నీప్రియపుత్రునిపైననా పగసాధింపఁ జూచుట. ఒరులు విన్ననవ్వరా? పుత్రఘాతకుఁడ వని

నిందింపరా? ఎంతకష్ట మెంతకష్టము. పగకానిం గొల్చుచుండె నను నేర మొక్కటియేగదా వానియందుంట. పసికూనయే-అది యునుంగాక యజ్ఞానంబువలనం గొల్చెడియర్థంబులేని భక్తివలన మన కేమినష్టము. నీవేల కరుణవహింపవు? నాథా! అనుగ్రహింపుము. పుత్రభిక్షమిమ్ము (విషపాత్రందీసికొనుచు) దయయుంపుము. రక్షింపుము.

హిర—(మేఘగర్జనస్వరముతో) నీప్రార్థనలఁ జాలించి యీవిషంబు వానిచేఁ ద్రావింపుము. సంశయింపకుము.

లీలా—(విచారముతో) ఇదేటిన్యాయము. ఇంకెట్లు నాప్రాణంబులు భరియింతును. నవమాసంబులు మోసి-కని-పెంచి-చేఁజేతనే విషమిచ్చి చంపెడితల్లు లెందైనం గలరా? హా! హా! హా!

హిర—ఓసీ! నీచదువులు మాని నాయాజ్ఞ నిర్వర్తించుము. (త్రోసివేయును.)

ప్ర—అమ్మా! సతులకు పతియాజ్ఞమీఱుట ధర్మముకాదు. కావున నీవిట్లు బేలవై జాలిందూలక విష్ణుసేవామృతంబును నాకిమ్ము. (విషమును దీసికొనును.)

లీలా—హా! తనయా! తనయా! హా! హా! హా! (మూర్ఛిల్లును.)

ప్రహ్లా—(విషపాత్రను చేతంబట్టుకొని కొంచెముసేపు ధ్యానము జేసి)

ఉ. గాదిలి కన్నబిడ్డఁడని గారవ । మించుకయైన లేక, నక్
బాదుగ సంహరించుటకు । బాధ లనేకము గల్గఁజేసి, వి
చ్ఛేదము సేయలేక, మదిఁ । జింతిలి ఘోరవిషానలంబు, సం
ఖాదముగాఁగఁ జేసెనిఁకఁ । గావఁగదే కరుణాపయోనిధీ!

ఆహాహా! నేఁటికి మద్భాగ్యవశంబున విష్ణుసేవామృతమును సేవింపం గల భాగ్యము గలిగినది. (అని త్రావుచున్నాఁడు.)

లీలా—(మేల్కాంచి చూచి) తనయా! తనయా! నన్ను విడనాడి

పోయెదవా ! (అని మరల మూర్ఛిల్లుచున్నది.)

హిర—(నిట్టూర్పువిడచి తనలో)ఏమిది విషపానమువలనను కుంభకుం డసువులంబాయకుండెనే? ఏమయియుండును ? (ఆలోచించి) దీనింబట్టి యాలోచించిచూచినచో వీనివలన నాకేయాపదఘటిం యించుననితోంచుచున్నయది. (ఆశ్చర్యముతో) తోంచుటయేమి నా? నాకు మృత్యువుతప్పదా? (ఆలోచించి) అట్లయినవిధాత యొసంగిన వరంబులు రిత్తబోవునా? కల్ల. అట్లెన్నటికినిఁబోవు. (ప్రకాశముగా) ఓరోరి రాక్షసకులార్ణవబడబానలా! నిన్ని ప్పుడీ ఖడ్గంబున కెరచేయందలంచితి. ఏమనియెదవు? హరిభక్తి మానెదవా?నీశిరము మొండెమునుండి వేఱుచేయుమనెదవా? నేనే చంపఁదలంచుకొన్న నీకు దిక్కెవ్వరురా మూర్ఖా ?

ప్రహ్లా—జనకా ! సత్వరజస్తమోగుణప్రధానుఁడై లీలావినోదంబున సకల ప్రపంచంబుల గల్పించి, రక్షించి, ఖండించునట్టికర్తయై భర్తయై, హర్తయై యన్నిరూపంబులయందునను ప్రకాశించు నట్టివాఁడై, యెవ్వఁడు తన భక్తులం గాపాడుచుండెనో యట్టి మహానుభావుఁడే నాకు దిక్కు.

హిర—ఏమి నీవాచాలత్వము? నీసందర్భమంతకంతకుమర్యాదనతిక్ర మించి ప్రవర్తించుచున్నయదే? నీకాహరియేదిక్కుగా? హరి యన్నిరూపంబులందునుంబ్రకాశించువాఁడుగా? అట్లయినవాఁ డిప్పుడిక్కడ,యేరూపంబునం బ్రకాశించుచుండెనోయెఱుంగం జేయుము? నిన్నునువానినింగూడ మర్దించి లోకము నిష్కం టకము గావించెదను. సందేహించెదవేలరా దుర్మతీ !

ప్రహ్లా—నాయనా! నానాజంగమస్థావరవర్గంబులయందును,నీయందు ను, నాయందును, సకలప్రదేశంబులయందును,నంతర్జ్యోతియై ప్రకాశించుచుండును. వెండియు యీయారూపంబు లననేల?

,కలరూపంబు లాతనివే !

కం. ఇందు గలఁ డందు లేడను
సందేహము వలదు చక్రి । సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దాన । వాగ్రణి వింటే" (భాగవతము)

హిర—(కోపముతో) ఏమంటివి ? (వికటముగా)
"కం. ఇందు గలఁ డందు లేడను
సందేహము వలదు చక్రి । సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దాన । వాగ్రణి వింటే?"

అనియా ! నేనెచ్చటఁ జూపుమనిన నచ్చటాహరిం జూపఁగలవా ?

ప్ర—జనకా ! మీయాజ్ఞయైనచో-

లీలా—(మూర్ఛఁదేరి వెఱ్ఱిదానివలెఁ జూచుచు నిలువంబడును)

హిర—అట్లయిన నేదీ చూత మీసభా స్తంభంబుననాహరింజూపుము?

ప్ర—(స్తంభముచుట్టుఁ బ్రదక్షిణముఁ జేయుచు) త్రైలోక్యపాలకా!
పురాణపూరుషా! చాతుర్హోత్రరూపా !!!

తే. గీ. సర్వమేధాయ కర్మణి । స్తారణాయ
స్నిగ్ధనానార్థ భూషాయ । చిన్మయాయ
నిఖిలనాథాయ శాన్తాయ । నిర్గుణాయ
విశ్వరూపాయ రోచిష్ణ । వే నమోస్తు.

ఓ దేవా! నినుఁజూడ నాతండ్రి మిక్కిలి యాసవహించియున్నాఁడు.
నేను నీభక్తుండనేని నాతండ్రికోర్కె నెఱవేర్పుము.

హిర—ఓరీ! నేను కాలహరణంబున కోర్వను. వేగఁ జూపుము !

ప్ర—తండ్రీ ! స్తంభంబందుననున్న నాహరిని జూడందలంచితి వేని
నీవే పిల్వుము. మఱియు నీకీసందేహమేల ?

"శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణప । ర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబుననుండు ప్రోథవిపుల । స్తంభంబునందుండఁడే?
స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు నే । సందేహము న్లేమ, ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్ర । త్యక్షస్వరూపంబునన్"

కాఁబట్టి నీ వాసంశయము వీడి పిలువుము. (భాగవతము.)

హిర—(క్రోధముతో స్తంభంబుదరిం జని బిగ్గరగా) ఓరోరిమాధవా! హిరణ్యాక్షుని పందివై చంపిన పిఱికిపందా! నీచమగు చేప రూపమున సోమకాసురునిఁ జంపిన పోటుమానిసీ! కపట మార్గానువర్తీ!

శా. క్రోధోద్రేకముతోడ మీనకమఠ । క్రోడాకృతుల్ దాల్చిమా
యాధిక్యంబున నన్నుఁ జంపుటకునై । యత్నించి, యత్యంతముగ్
మేధాస్నిగ్ధభుజాబలంబునకు దా । ల్మిగ జెందఁగాలేక, బృ
ధ్వాధైర్యంబుననున్నచో పిఱికి పం । దా! రమ్ము ఖండించెదన్.

నీకు నిక్కువమైన పౌరుషమే గలదేని పురుషసింహుండవై వచ్చి నా యెదుట నిలువుమురా! (అని స్తంభంబును గ్రుద్దుచున్నాఁడు.)

(స్తంభము బద్దలగును.)

[శ్రీనారసింహావతారము గాన్పించును]

శ్రీనార—(ఊంకారధ్వని చేసి హిరణ్యకశిపుని బట్టుకొనఁబోవు చుండును.) (తెర వ్రాలును.)

పంచమరంగము.

[శ్రీనారసింహుని యూరువులపై హిరణ్యకశిపుఁడు పడియుండఁగా లీలావతి యొకప్రక్కను, ప్రహ్లాదుఁ డొకప్రక్కను నిలుచుందురు. బ్రహ్మాదు లొకదెస నిలుతురు.
తెర లేచును]

బ్రహ్మాదులు—(స్తుతింతురు)

ప్ర—(కరములుమోడ్చి)

మ. ఫలముల్ పూవులు పల్లవంబులును శో । భం జెందు భూమీజము
ట్టుల నీభావము పక్వగౌరమృదుశా । టోపంబులన్ జెంది; ని
శ్చలకారుణ్యముతోడ భక్తులను స్వే । చ్ఛావృత్తిసంరంభతన్
వెలయన్జేసిన నీమహామహిమలన్ । వేతెద్ది సర్వేశ్వరా!

శ్రీనార—(శాంతి వహించును.) (తెర వ్రాలును)

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ.

ఇది శ్రీసత్యవతీ కృపాపాత్ర భారద్వాజసగోత్ర పవిత్రాయినాపురపు వంశలతాంకూర సత్యమాంబా బాపనామాత్య మిథునగర్భ శుక్తిముక్తాఫల మృదుమధుర కవితావిశేష్యే లేశ్వర సుబ్రహ్మణ్యశాస్త్రి, మలకపల్లి చిన శేషగిరిరాయ కవి ద్వయ ప్రియశిష్య విబుధ సజ్జన విధేయ సోమేశ్వరాహ్వయ కవి ప్రణీతంబైన ప్రహ్లాదనాటకమునందు సర్వమ్మును

పంచమాంకము

సమాప్తము.

అనుబంధములు.

1 వ అనుబంధము.

[తెర యెత్తఁగానే జయవిజయులు పాడెడుపాట.]

మోహనరాగము—ఆదితాళము.

ప॥ మనదే భాగ్యము - మనదే పుణ్యము

1 ఎల్లకాల మిటు - చల్లని తండ్రిని - చల్లగ గొలుచుచు
ద్వారపాలకులమయి - దనరుచునుండెడి॥ మన॥

2 ఎట్టిపుణ్యము మన - మెన్నఁడు జేసితిమో
యిట్టివైభవము మన - కిప్పుడు గల్గుట కరయఁగ॥ మన॥

3 రాజీవనేత్రుని పద - రాజీవములను సతతము
భక్తిని గొల్చుచు భజి - యించెడి ప్రాప్తి లభించిన॥ మన॥

4 శ్రీరామామనోహరుని - చిత్తమునందున నిల్పి
పాదసన్నిధినె - నెప్పుడు - బడియుండెడి॥ మన॥

2 వ అనుబంధము.

[శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయినప్పుడు జయవిజయులు పాడెడిపాట]

కళ్యాణిరాగము—ఏకతాళము.

ప॥ మము - రక్షించుము దేవా!

1 శ్రీకర గిరివర - కరుణాకర - శుభకర
యోగీంద్ర హృద్విహారా! దయజూచుచు॥ మము॥

2 ప్రకటితమగు నీ మహా - మహిమ తెలియగనో
యకలంకా - యెవరితరము - మా తరమా॥ మము॥

3 మునులు శపించిరి - ఘనరాక్షసులు గండని
మనజాలము నిను వీడి - దయతోడుత॥ మము॥

4 పాహి, పాహి, యని - పాదములంటితిమయ్యా!
దాసోహమన్నవారి బ్రోవ - ధర్మము గదటయ్యా॥ మము॥

3 వ అనుబంధము.

[హిరణ్యాక్షుఁడు చనిపోయెనని విని హిరణ్యకశ్యపుడు
సందర్భానుసారముగా బాడెడుపాట]

ముఖారిరాగము—ఏకతాళము.

ప॥ హా, హా, హా, హా, సో - ద - రా!
పోయితివా దివికి - ననువీడి॥

1 కిటి యేమి? నీప్రాణముదీయుట యేమి? న
మ్మట కర్హముగాదుర - ఆ - సోదరా - ఆహా॥ హా॥

2 ముల్లోకంబులు గడ - గడ లాడఁజేసిన
నీ నామము నెట్లు మరతురా సోదరా!॥ హా॥

3 తల్లికేమనినే - ధైర్యము జెప్పుదురా!
తల్లి కొక్కనిఁజేసి - తరలిపోతివా సోదరా॥ హా॥

---

4 వ అనుబంధము.

[మహేంద్రుఁడు తీసికొనిపోవుచుండెనని లీలావతి
సందర్భానుసారముగా బాడెడుపాట]

హిందూస్థాని తోడిరాగము—త్రిశ్రగతి.

1 నాపతి తపంబు చేయఁ - బోయినపుడె
నా కీ - దుర్గతి గూర్చితే - దైవమా?॥ నా॥

2 ఓహో! నాథా! - నాథా! - యెందుంటివో
నీవు గృహమున లేని తరి - యింద్రుండు నా
కీ - పాటు గూర్చెనుగంటే॥ ఓహో॥

3 నీ సతి - మానము గాచెడి - దిక్కు లేదు - లవమైన
కాపాడరావె - నాపయి దయరాదే
నా మొఱ వినఁబడదే॥ ఓహో॥